

జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

# జనస్వరం
పవర్
అక్షరమే ఆయుధం

www.janaswaram.com



**పాఠకులకు విజ్ఞప్తి**

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ : janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690



సంపుటి : 4 | సంచిక : 289 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 03-05-2025 | పేజీలు : 5


# అమరావతి 2.0.. జయహో..

- వేడుకలా రాజధాని పునః ప్రారంభోత్సవం
- ప్రధాని మోదీ రాకతో పండుగ వాతావరణం
- అమరావతి ఔన్నత్యాన్ని కీర్తించిన సీఎం చంద్రబాబు
- కీలక ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- నాగాయలంక మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ వర్చువల్ ప్రారంభం
- దేశ రక్షణకు నవశక్తిని ఇస్తుందంటూ ప్రధాని వ్యాఖ్య
- విజయవాడ-కాజిపేట మూడోలైన్ జాతికి అంకితం
- దారులన్నీ రాజధానివైపే.. భారీగా తరలిన జనం
- వందలాది వాహనాలతో పార్కింగ్ ప్రాంతాలు ఫుల్
- కిక్కిరిసిపోయిన సభా ప్రాంగణాలు, గ్యాలరీలు



**విజయవాడ/గుంటూరు/తుళ్లూరు, మే 2 (జనస్వరం) :** అమరావతి జన సంద్రంగా మారింది. వెలగపూడి వేదికగా రాజధానిలో రూ.49 వేల కోట్ల పనులకు, నిర్మాణాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఇతర మంత్రులు ప్రధాన వేదికపై ఆశీనులు కాగా, ఈ వేడుక అంగరంగ వైభవంగా జరిగింది. రాజధాని గ్రామాల ప్రజలే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. సభ జరిగే వెలగపూడితో పాటు అన్ని గ్రామాల్లోనూ ఇదే వాతావరణం కనిపించింది. సభకు వెళ్లే మార్గాలన్నీ వాహనాలు, జనంతో నిండిపోయాయి. కాగా, ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాగాయలంకలో మిస్సైల్ టెస్టింగ్ సెంటర్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశరక్షణ వ్యవస్థలో కీలకపాత్ర పోషించనున్న మిస్సైల్ టెస్టింగ్ సెంటర్‌ను నవదుర్గగా అభివర్ణించారు. అమరావతి రాజధానికి అన్నివిధాలా సహకరిస్తానని ఆయన చెప్పటంతో సభికులు చప్పట్లతో హర్షాతిరేకాలు వ్యక్తపరిచారు. అలాగే, విజయవాడ–కాజిపేట మూడోలైన్ మార్గాన్ని కూడా ప్రధాని ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారు. అమరావతి కోసం భూ సమీకరణలో భూములిచ్చిన రైతులు మురిసిపోయారు. ఐదేళ్లు అష్టకష్టాలు పడ్డామని, తిరిగి అమరావతికి ప్రాణం పోస్తున్నారంటూ హర్షం వ్యక్తం చేశారు. సభలో అమరావతి రైతులకు అగ్రస్థానాన్ని అందజేశారు. ఏ ప్లస్ పాసులు ఇచ్చి ప్రత్యేకంగా గ్యాలరీ ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రవేశ ద్వారంలో అనుమతించారు.

**అన్నిదారులూ అమరావతివైపే.. :**
అమరావతిని చూడాలన్న ఆకాంక్షతో రాష్ట్రం నలుమూలల నుంచి ప్రజలు తరలివచ్చారు. దీంతో ఉదయం 10 గంటలకే రాజధానికి దారితీసే మార్గాల్లో జనసందోహం కనిపించింది. ట్రాఫిక్‌లో చిక్కుకుపోయిన వివిధ ప్రాంతాల ప్రజలు సాయంత్రం 6 గంటలకు సభ ముగిసిన సమయంలో కూడా ప్రాంగణానికి చేరుకుంటూనే ఉన్నారు.

**మధ్యాహ్నానికే కిటకిట :**
వేలాదిగా ప్రజలు తరలిరావడంతో సభా ప్రాంగణం మ?ధ్యాహ్నం 12 గంటలకే నిండిపోయింది. గ్యాలరీలన్నీ నిండిపోవడంతో ఆలస్యంగా సభా ప్రాంగణానికి చేరుకున్న వారు రోడ్లపైనే ఉండాల్సి వచ్చింది. పార్కింగ్ ప్రదేశాలతో పాటు ఈ–6, 7, 8 రోడ్ల వరకు, ఎన–9 రోడ్డు, సచివాలయం చుట్టుపక్కల రోడ్లన్నీ జనంతో కిక్కిరిసిపోయాయి. సభా ప్రాంగణానికి చుట్టుపక్కల కిలోమీటరు మేర ఎటుచూసినా జనమే కనిపించారు.

**వెల్లివెరిసిన జాతీయత :**
రాజకీయ పార్టీల జెండాలకు ఆస్కారం లేకుండా అమరావతి పునర్నిర్మాణ పండుగ జరిగింది. ప్రజలు మూడు రంగుల జెండాలను ప్రదర్శిస్తూ జాతీయతను చాటారు. సభ వెలుపల, సభా ప్రాంగణంలో ఎక్కడా ఏ పార్టీ జెండాల ప్రదర్శన లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. కేవలం మువ్వన్నెల జాతీయ జెండాను మాత్రమే అనుమతించారు. ప్రధాని సభావేదిక మీదకు రాగానే ప్రజలు వందేమాతరం.. అంటూ స్వాగతం పలికారు. అమరావతి రైతులు జయహో... అమరావతి అంటూ పచ్చ కండువాలు గాలిలో ఊపారు. అలాగే, ప్రధాని హెలిప్యాడ్ మొదలు సుమారు 1.3 కిలోమీటర్ల దూరం పొడవునా సభా ప్రాంగణం వరకు జాతీయ జెండాలతో అలంకరించారు.

**బస్సెనక బస్సు :**
అన్నిదారులూ అమరావతివైపే సాగాయి. వందలాది బస్సులు అమరావతికి క్యూ కట్టాయి. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం నుంచి అంచనాలకు మించి బస్సుల్లో తరలివచ్చారు. దీంతో జాతీయ రహదారులన్నీ కిటకిటలాడాయి. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి 400 ఆర్టీసీ బస్సులు, 2,500కు పైగా ప్రైవేట్ బస్సుల్లో అమరావతి వెళ్లారు. ఇవికాకుండా సొంతకార్లు, ఇతర వాహనాల్లోనూ బయల్దేరి వెళ్లారు. హైదరాబాద్ నుంచి కూడా తండోపతండాలుగా వాహనాలు తరలివచ్చాయి. ఈ వాహనాలన్నీ ఎన్టీఆర్ జిల్లా మీదుగానే వెళ్లాల్సి రావడంతో రోడ్లన్నీ రద్దీగా మారాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రద్దీ కొనసాగింది. పోలీసుల ముందస్తు ప్రణాళికల కారణంగా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం కాలేదు. భారీ వాహనాలను నగరం వెలుపల నుంచి మళ్లించడంతో సమస్యలు తలెత్తలేదు. బస్సులు భారీగా తరలివస్తుండటంతో అధికారులు ఒకింత ఆందోళన చెందారు. మధ్యాహ్నం 2 గంటలకే అమరావతిలో సభా ప్రాంగణం పక్కనే ఏర్పాటు చేసిన వాహనాల పార్కింగ్ ప్లేస్‌లు నిండిపోయాయి. వస్తున్న వాహనాలకు చోటు లేకపోవటంతో నగరం బయటే వాహనాలను నిలుపుదల చేశారు. చాలామంది నడుచుకుని అమరావతి వెళ్లారు. అశేషంగా వస్తున్న ప్రజలకు భోజన ఏర్పాట్లు కూడా సరిపోకపోవడంతో అదనంగా ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

**ఆటంకాలు లేకుండా అమరావతికి..**
**కీలకంగా మారిన పశ్చిమ బైపాస్**
రాష్ట్రంలో ఎక్కడెక్కడి నుంచో బస్సులు కదిలొచ్చినా విజయవాడపై మాత్రం ఆ ప్రభావం పడలేదు. సాధారణ వాహనదారులు ముందుకు సాఫీగా సాగిపోయారు. దీనంతటికీ ప్రధాన కారణం పశ్చిమ బైపాస్ రోడ్డు మార్గమే. వెలగపూడిలో రాజధాని పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం భారీ స్థాయిలో నిర్వహించినా నగరం మీదుగా ఎలాంటి బస్సులు రాకపోకలు సాగించకుండా ఈ రోడ్డు ప్రధానంగా నిలిచింది. బస్సులన్నీ నగరంలోకి ప్రవేశించకుండానే అమరావతి చేరుకున్నాయి. ఉత్తరాంధ్ర, గోదావరి జిల్లాల నుంచి బస్సులు భారీగా రాగా, గన్నవరం నుంచి నిర్మించిన పశ్చిమ బైపాస్ మీదుగా సభా ప్రాంగణానికి చేరుకున్నాయి. ఇందుకు కృష్ణా బ్రిడ్జి కూడా కీలకంగా ఉపయోగపడింది. ఫలితంగా గోదావరి, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చిన బస్సులు నేరుగా ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వెలగపూడి చేరుకున్నాయి. ఎన్టీఆర్ జిల్లా నుంచి బయల్దేరిన వాహనాలు కూడా ఇదే మార్గంలో వెళ్లాయి. కృషాజిల్లా నుంచి కొన్ని బస్సులు మాత్రం వారధి మీదుగా వెళ్లాయి.

**అండగా నిలుస్తా భుజం కలిపి నడుస్తా**
నా అనుభవంతో చెబుతున్నా! ఫ్యూచర్ టెక్నాలజీతోపాటు.. భారీ ప్రాజెక్టులను త్వరగా, అత్యుత్తమంగా పూర్తిచేయడం చంద్రబాబుకే సాధ్యం. రాష్ట్రంలోని ప్రతి యువకుడూ తన కలలు నెరవేర్చుకునే నగరంలా అమరావతి రూపుదిద్దుకుంటుంది. ఐటీ, ఏఐ, గ్రీన్ ఎనర్జీ, క్లీన్ ఇండస్ట్రీ, విద్యా, వైద్యం.. ఇలా కీలక రంగాల్లో లీడింగ్ సిటీ అవుతుంది. ఈ రంగాలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, రికార్డు స్థాయిలో పనులు పూర్తయ్యేందుకు కేంద్రం పూర్తి మద్దతు ఇస్తుంది.

**నాడు చంద్రబాబును చూసి టెక్నాలజీ నేర్చుకున్నా..**
టెక్నాలజీలో చాలా ముందున్నానని చంద్రబాబు నన్ను ప్రశంసించారు. కానీ, ఓ రహస్యం చెబుతా. నేను గుజరాత్ సీఎం అయిన కొత్తలో.. అప్పటికే చంద్రబాబు హైదరాబాద్‌లో కూర్చుని చేస్తున్న పనులన్నీ నిశితంగా పరిశీలించే వాడిని. మా అధికారులతోనూ అధ్యయనం చేయించా. టెక్నాలజీ విషయంలో చంద్రబాబు నుంచి చాలా నేర్చుకున్నా. అప్పుడు నేర్చుకున్నవే ఇప్పుడు అమలు చేస్తున్నా.

**ఆత్మగౌరవ ప్రతీక అమరావతి**
"అమరావతి కేవలం ఒక రాజధాని నగరమే కాదు. అది ఐదు కోట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజల సెంటిమెంట్. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి, ఆత్మవిశ్వాసానికి, ఆశలకు, ఆకాంక్షలకు ప్రతిరూపం." అని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. వెలగపూడిలో శుక్రవారం జరిగిన అమరావతి పనుల పునఃప్రారంభ సభలో చంద్రబాబు మాట్లాడారు. అమరావతి పనులు పునఃప్రారంభించుకుంటున్న ఈ రోజు ఆంధ్రప్రదేశ్ చరిత్రలో శాశ్వతంగా లిఖించదగ్గ రోజుగా గుర్తుండిపోతుందని సీఎం వ్యాఖ్యానించారు. '2014లో రాజధాని లేని పరిస్థితుల్లో పాలన ప్రారంభించుకున్నాం. 29వేల పైచిలుకు మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రాజధాని కోసం 34 వేల ఎకరాలు ఇచ్చారు. వారి త్యాగాలు ప్రపంచానికి ఆదర్శం. కానీ వారి త్యాగాలను గత వైసీపీ ప్రభుత్వం అపహాస్యం చేసింది. అవహేళన చేసింది. రాజధాని రైతులు ఎన్నో బాధలు పడ్డారు.. అవమానాలు ఎదుర్కొన్నారు.. లాఠీ దెబ్బలు తిన్నారు.. జైలుకుపోయారు. కానీ వెనకడుగు వేయలేదు. ఇలాంటి ఉద్యమాన్ని నా జీవితంలో చూడలేదు.. ఇకపై చూస్తానని కూడా అనుకోవడం లేదు.' అని చంద్రబాబు పేర్కొన్నారు. రైతులు చేసిన న్యాయపోరాటం ఫలితంగా న్యాయస్థానాలు అమరావతిని బతికించాయన్నారు. చంద్రబాబు ప్రసంగం ఆయన మాటల్లోనే.. మోదీ మొహంలో బాధ కనిపించింది


**ఆహ్లాదంగా ఉండే ఆయన గంభీరంగా కనిపించారు**
**పహల్గాం ఉగ్రదాడిని సభలో ప్రస్తావించిన చంద్రబాబు**
అమరావతి పునఃప్రారంభ సభలో పహల్గాం ఉగ్రదాడి అంశాన్ని సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. "గతంలో ఎప్పుడు మోదీని కలిసినా ఆహ్లాదంగా ఉండేవారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత మోదీని కలిసినప్పుడు ఆయన మొహంలో బాధ చూశాను. అమరావతి పనుల పునఃప్రారంభోత్సవానికి ఆహ్వానించడానికి వెళ్లినప్పుడు ఆయన చాలా గంభీరంగా కనిపించారు. ఉగ్రదాడిలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయారన్న ఆవేదన మోదీలో కనిపించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల తరఫున చెబుతున్నాను. ఉగ్రవాదాన్ని అణచివేయడానికి ప్రధాని మోదీ తీసుకునే ప్రతి చర్యకూ మద్దతుగా ఉంటాం. విశాఖలో వచ్చే నెల 21వ తేదీన పదో యోగా దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి ప్రధాని తాను వస్తానని అన్నారు. ఆయన రాక మనకు స్ఫూర్తినిస్తుంది." అంటూ

మిగతాది 3లో..






## జీవితం - వి"చిత్రం"




## ఈ రోజు పంచాంగం వేళలు

**తేదీ :** 03 మే 2025,
**తిథి :** శుద్ధ షష్ఠి (ఉ.07:55వ.కు),
**నక్షత్రం :** పునర్వస్సు (మ.12:35వ.కు)
**బ్రహ్మ ముహూర్తం :** తె.04:10ల తె.04:58
**రాహుకాలం :** ఉ.08:55ల ఉ.10:30,
**యమగండం :** మ.01:39ల మ.03:14,
**వర్జ్యకాలం :** తె.00:45ల తె.02:33, రా.08:37ల రా.10:25

## ఈ రోజు నమాజ్ వేళలు

**తేదీ :** 03 మే 2025,
**ఫజర్ :** తెల్లవారుజామున గం. 04:41
**సూర్యోదయం :** ఉదయం గం. 05:56
**జొహర్ :** మధ్యాహ్నం గం. 12:17
**అసర్ :** సాయంత్రం గం. 03:26
**మఘ్రిబ్ :** సాయంత్రం గం. 06:38
**ఇష :** రాత్రి గం. 07:53





జనస్వరం
**విలేకరులు కావలెను**
"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు
రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను..
అసక్తి ఉన్న వారు సంప్రదించండి..
సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

# జగన్ మంచి ఛాన్స్ మిస్ చేసుకున్నట్టే!

నవ్యాంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనులకు శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టనున్నారు. అంగరంగ వైభవంగా, ఓ వేడుకలా, ఓ పండుగలా జరుగుతున్న ఈ కార్యక్రమానికి దూరంగా ఉన్న జగన్ ఓ మంచి అవకాశాన్ని తన చేజేతులారా మిస్ చేసుకున్నారనే చెప్పాలి. అమరావతిలో కన్నులపండువగా జరుగుతున్న ఈ వేడుకకు హాజరు కావాలంటూ కూటమి సర్కారు స్వయంగా ఆహ్వానించినా జగన్ ఆ ఆహ్వానాన్ని మన్నించలేదు. శుక్రవారం జరుగుతున్న ఈ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానం బుధవారం సాయంత్రమే జగన్‌కు అందింది. అయితే తన మునుపటి వైఖరి మాదిరే మొండిగా సాగిన జగన్.. గురువారం రాత్రే తాడేపల్లి నుంచి బెంగళూరు వెళ్లిపోయారు. వెరసి అమరావతి పునర్నిర్మాణానికి తాను హాజరు కావట్లేదని ఆయన తేల్చి చెప్పేశారు. తెలుగు నేల విభజన తర్వాత రాజధాని కూడా లేకుండా ప్రస్థానం మొదలుపెట్టిన ఏపీకి నూతన రాజధానిగా అమరావతిని నాటి, నేటి సీఎం నారా చంద్రబాబునాయుడు ఎంపిక చేశారు. బాబు ఎంపికను స్వాగతించిన జగన్.. అమరావతికి తాను వ్యతిరేకం కాదని ప్రకటించారు. అంతేకాకుండా తాను రాజధాని నిర్మాణానికి ముందే తన ఇంటిని రాజధానిలోనే కట్టుకుంటానని ప్రకటించి.. తాడేపల్లిలో పాలెస్ లాంటి భవంతిని కట్టుకున్నారు. జగన్ నిజంగానే అమరావతికి అనుకూలంగా ఉన్నారేమోనన్న భావనతో 2019 ఎన్నికల్లో జనం వైసీపీకి ఓటేశారు. ఎప్పుడైతే సీఎంగా పదవీ బాధ్యతలు చేపట్టారో.. జగన్ తనలోని అమరావతి వ్యతిరేకతను వ్యక్తం చేయడం ప్రారంభించారు. అమరావతి నిర్మాణాన్ని అటకెక్కించారు. కొత్తగా విశాఖలో పాలనా రాజధాని కడతానంటూ విచిత్ర ప్రకటనలూ చేశారు. ఫలితంగా 2024 ఎన్నికల్లో జగన్ పార్టీ ఘోర పరాజయానికి గురి కాక తప్పలేదు. ఇదంతా గతమైతే.. అమరావతిని ఈ ఐదేళ్లలో ఎలాగైనా పూర్తి చేసి తీరాల్సిందేనని చంద్రబాబు ఓ గట్టి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రానికి రెండో సారి సీఎం అయిన వెంటనే అమరావతి పునర్నిర్మాణంపై దృష్టి సారించారు. తొలుత నిధులను సాధించిన చంద్రబాబు.. పనులను పున:ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న చంద్రబాబు.. అమరావతిని ప్రారంభించిన మోదీ చేతుల మీదుగానే పునర్నిర్మాణాన్ని కూడా చేపట్టాలని భావించారు. అందుకు మోదీ కూడా సరేనన్నారు. వెరసి కార్యక్రమానికి సమయం ఆసన్నమవుతున్న వేళ.. చంద్రబాబు రాజకీయాలను పక్కనపెట్టేశారు. విపక్ష నేతగా, మాజీ సీఎంగా జగన్‌ను కూడా ఈ వేడుకకు ఆహ్వానించాలని భావించారు. నిబంధనల మేరకు ప్రొటోకాల్



## ఎడిటోరియల్

సిబ్బంది పంపి మరీ జగన్‌ను ఈ కార్యక్రమానికి ఆహ్వా నించారు. అయితే జగన్ బాబు ఆహ్వానాన్ని తిరస్కరించి ఎంచక్కా బెంగ ళూరు చెక్కేశారు. వాస్తవానికి అమరావతి పునర్నిర్మాణానికి హాజరై ఉంటే.. ప్రజల్లో తన పట్ల ఉన్న వ్యతిరేకతను కొంతైనా తగ్గించుకునే అవకాశం జగన్‌కు ఉండేది. గతంలో జరిగిన పరిణామాలను మనసులో పెట్టుకోకుండా.. తన ఓటమిని కూడా సానుకూలంగానే తీసుకున్న జగన్ అమరావతి పునర్నిర్మాణానికి వచ్చారని జనం భావించేవారు. ఇకపై అమ రావతిని జగన్ వ్యతిరేకించరులే అన్న భావనను ఆయన జనంలో కలిగించి ఉండేవారు. అంతేనా.. ఎన్నికలప్పుడే రాజకీయాలు.. ఎన్నికలు ముగిసిన తర్వాత రాజకీయాలు మాట్లాడను అన్న తన మాటను కూడా ఆయన నిజం చేసి ఉండేవారు. ఇదే భావనను మోదీలోనూ కలిగించి తన పట్ల ఒకింత సానుకూలత వ్యక్తమయ్యేలా చేసుకునేవారు. అయితే తనదైన శైలి మొండి వైఖరితోనే సాగిన జగన్.. అమరావతి పునర్నిర్మాణాన్ని దాదాపుగా బాయ్ కాట్ చేసినంత పని చేశారు. మొత్తంగా అందివచ్చిన ఓ మంచి అవకా శాన్ని జగన్ చేజేతులారా నాశనం చేసుకున్నారన్న విశ్లేషణలు సాగుతున్నాయి.

జమ్ము సాయి కల్యాణ్,
పొలిటికల్ అనలిస్టు,
మేనేజింగ్ డైరెక్టర్,
జనస్వరం మీడియా.



## ఉదయ భాస్కర్‌కు దాసరి సేవా రత్న అవార్డు

### అవార్డును అందజేసిన సినీ ప్రముఖులు



**పాలకొల్లు, మే 2 (జనస్వరం) :** సీనియర్ జర్నలిస్ట్ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ పశ్చిమగోదావరి జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత గుమ్ములూరు ఉదయ భాస్కరరావుకు, దాసరి సేవారత్న అవార్డు లభించింది. దర్శకరత్న దాసరి నారాయణరావు జన్మదినాన్ని పురస్కరించుకొని హైదరాబాదు ప్రసాద్ ల్యాబ్‌లో జరిగిన దాసరి ఫిలిం అవార్డు సభలో, సినీ నటులు మురళీమోహన్, హీరో సుమన్ సాయి కుమార్, నిర్మాత తుమ్మలపల్లి రామ సత్యనారాయణ అందజేశారు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ నిర్మాత దిల్ రాజు, విజయేంద్ర ప్రసాద్, దర్శకులు రేలంగి నరసింహారావు, అనిల్ రావిపూడి బి గోపాల్ హీరోయిన్ దివ్యవాణి కోర్టు చలనచిత్ర దర్శకులు నిర్మాతలు నటుడు దర్శకుడు ధనరాజ్ అవార్డు గ్రహీతలు హాజరైయ్యారు. జర్నలిస్ట్ ప్రభు స్వాగతం పలికారు. దాసరి అవార్డు గ్రహీత అయిన జర్నలిస్ట్ ఉదయ భాస్కర రావుకి మహారాష్ట్ర బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ, ప్రముఖ నటులు కాపినిస్తే కార్టూ నిస్ట్ తాడి బలరాం, నటుడు సినీ దర్శకుడు ఆకుమర్తి బాబురావు ఈ సందర్భంగా రంగస్థలం నటుడు దర్శకుడు సీనియర్ జర్నలిస్ట్ అయిన ఉదయ భాస్కర్‌కు, దాసరి సేవ రత్న ఫిలిం అవార్డు రావటం పట్ల ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

## జేఎన్టీయూ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సౌజన్యకు డాక్టరేట్



**పులివెందుల, మే 2 (జనస్వరం) :** పట్టణంలోని జేఎన్టీయూ కళాశాలలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సౌజన్యకు పీహెచ్డీలో పట్టా లభించింది. జేఎన్టీయూ కళాశాలలో పని చేస్తూ డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం యూనివర్సిటీ ఇండోర్లో పిహెచ్డి చేశారు. సౌజన్య మాట్లాడుతూ కమ్యూనికేషన్ ఇమేజ్ ప్రాసెసింగ్‌ని ఉపయోగించి ఒక అల్గారిథామ్ విభిన్న సాంకేతికత విశ్లేషణకు పీహెచ్డీ పట్టా ఇచ్చినట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ డి.విష్ణువర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ కె.శేష మహేశ్వరమ్మ, ఈసీఈ హెచ్వోడి డాక్టర్ షేక్ తాజ్ మహబూబ్, తోటి అధ్యాపకులు బృందం, సాయి యూనివర్సల్ మైనింగ్ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, మోహన్ రెడ్డి, జయసింహ, ప్రసాద్ రెడ్డి, నాగేంద్ర, టీచర్ గంగిరెడ్డి, ఆమె తండ్రి జయరామి రెడ్డి, ఆమె భర్త వాసుదేవ రెడ్డిలు అభినందనలు తెలియజేశారు

## టీడీపీకి అండగా బ్రాహ్మణ సంక్షేమం



**పులివెందుల, మే 2 (జనస్వరం) :** టీడీపీకి బ్రాహ్మణ సంక్షేమం అండగా ఉంటుందని బ్రాహ్మణ చైతన్య వేదిక నిరంతరం కృషి చేస్తుందని స్థానిక బ్రాహ్మణ సంఘాలు సహకరించాలని బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర ఆర్గనైసింగ్ సెక్రటరీ ప్రసాదరావు కోరారు. జమ్మలమడుగులో శుక్రవారం తాలూకా బ్రాహ్మణ సంఘం అధ్వర్యంలో శంకర జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ 5సంవత్సరాలుగా బ్రాహ్మణులకు సంక్షేమ పతకాలు అందలేదని బ్రాహ్మణ కార్పొరేషన్ నిర్వీర్యం అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రాహ్మణ సంక్షేమం కోసం తీసుకోవలసిన చర్యలు గురించి సంబంధిత మంత్రికి వినతి పత్రం ఇచ్చామని తెలిపారు. జీవనం కోసం పట్టణాలకు వలస వచ్చిన బ్రాహ్మణులకు పక్కా గృహాలు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. అదే విధంగా బ్రాహ్మణులకు రాజకీయ అవకాశాలు కల్పించాలని పార్టీ పరంగా పదవులు ఇచ్చి ప్రోత్సాహించాలని కొరినట్లు చెప్పారు. సమావేశంలో కడప జిల్లా బ్రాహ్మణ సంఘం కార్యదర్శి మురళీధర్ రావు, జమ్మలమడుగు తాలూకా బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నాగరాజశర్మ కార్యదర్శి రామకృష్ణ శ్రీనివాస రావు, దత్త, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## డయాలసిస్ కేంద్రాలను ప్రారంభించనున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

**నెల్లూరు, మే 2 (జనస్వరం) :** రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ శనివారం జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం ఉదయం కావలి నుంచి బయలుదేరి 9 గంటలకు మంత్రి వింజమూరు చేరుకుంటారు. వింజమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటుచేసిన డయాలసిస్ కేంద్రాన్ని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌తో కలిసి మంత్రి ప్రారంభిస్తారు. వింజమూరు నుంచి ఉదయం 11.45 గంటలకు నెల్లూరు చేరుకుని జయభారత్ ఆసుపత్రిలో నూతన విభాగాల ప్రారంభ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు పొదలకూరు చేరుకుని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో కలిసి పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో డయాలసిస్ కేంద్రాన్ని మంత్రి ప్రారంభిస్తారు. అనంతరం పొదలకూరు మీదుగా తిరుపతి చేరుకుంటారు.

## నిజాయితీకి చిరునామా వీఆర్ఓ దేవరపు రామారావు

- వీఆర్వో రామారావు ప్రతి ఉద్యోగికి ఆదర్శం
- ఆర్డీఓ దాసిరాజు
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జి



**పాలకొల్లు, మే 2 (జనస్వరం) :** నీతి నిజాయితీలకు చిరునామాగా రెవెన్యూ శాఖలో వీఆర్వో దేవరపు రామారావు మంచి పేరు తెచ్చుకొన్నారని నరసాపురం ఆర్డీవో దాసి రాజు, మాజీ ఎమ్మెల్యే బాబ్జి అన్నారు. శుక్రవారం ఆదర్శ వీఆర్వో దేవరపు రామారావు పదవీ విరమణ మహోత్సవం స్థానిక శ్రీ సాయి గాయత్రి కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. విఆర్ఓ దేవరపు రామారావు, పద్మావతి దంపతుల ఆత్మీయ అభినందన సభా కార్యక్రమానికి పాలకొల్లు తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నరసాపురం ఆర్డీఓ దాసిరాజు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బాబ్జి హాజరయ్యారు. ప్రముఖ వైద్యులు, లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వపు జిల్లా గవర్నర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ సత్యనారాయణ మూర్తి, (బాబ్జి) మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, వీటిని అధిగమిస్తూ రామారావు చేసిన నిజాయితీతో ప్రజలకు అందించిన సేవలు వెలకట్టలేని చెప్పారు. నర్సాపురం రెవెన్యూ డివిజనల్ అధికారి దాసి రాజు మాట్లాడుతూ సుమారు 25 ఏళ్లపాటు రెవెన్యూ శాఖలో నీతి నిజాయితీ నిబద్ధతలతో పనిచేసి ప్రజలకు అత్యుత్తమ సేవలందించిన ఉద్యోగులు అతి తక్కువ మంది ఉంటారని, అలాంటి వారిలో వీఆర్వో దేవరపు రామారావు ముందు వరుసలో ఉంటారని కొనియాడారు. తాను పాలకొల్లు ఎమ్మార్వోగా పనిచేస్తున్న సమయంలో వీఆర్వోగా రామారావు పని చేశారని, ఆయనకు ఉన్న మంచి వ్యక్తిత్వం తాను అప్పుడే గమనించానని ఆర్డీఓ రాజు ప్రశంసించారు. ఏ ఉద్యోగికి అయినా పదవీ విరమణ సహజమని చెప్పారు. నిజాయితీగా పనిచేస్తూ అవినీతి అంటని ఉద్యోగులు చాలా అరుదుగా కనిపిస్తారని, వీఆర్వోగా రామారావు చేసిన సేవలు ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని ఆర్డీఓ రాజు సూచించారు. తహసిల్దార్ యడ్ల దుర్గా కిషోర్ మాట్లాడుతూ తోటి రెవెన్యూ అధికారులకు ఉన్నతాధికారులకు సమాజంలోని మంచి విలువలు కలిగిన వ్యక్తులకు రామారావు సేవలు తప్పకుండా తెలియాలనే ఉద్దేశంతో ఈ ఆత్మీయ అభినందన సభ ఏర్పాటు చేయడం జరిగిందని వెల్లడించారు. ఇటువంటి రెవెన్యూ అధికారులను పలువురు ఆదర్శంగా తీసుకోవాలని తహసిల్దార్ సూచించారు. విశ్రాంత తహసీల్దారులు ఏవి రామాంజనేయులు, వి.నర్సయ్య, ఎం.సత్యనారాయణ, సీహెచ్ నరసింహారావు, టీడీపీ నాయకులు కర్నేన గౌరు నాయుడు, కాంగ్రెస్ నాయకులు కొలుకులూరి అర్జున్ రావు తదితరులు వీఆర్వో రామారావు చేసిన సేవలను కొనియాడారు. సభా కార్యక్రమాన్ని విశ్రాంత తహసిల్దార్ వి.సీత నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కర్నేన గౌరు నాయుడు, కర్నేన రోజా రమణి తదితరులు పాల్గొన్నారు.

## టెన్త్ కడపజిల్లా టాపర్ జోషికకు ఉపాధ్యాయుల ఘనసన్మానం



**పులివెందుల మే 2 (జనస్వరం) :** మారుమూల గ్రామాలలో కొంతమంది ప్రతిభావంతులైన విద్యార్థులు ఉంటారని, వారిలో దాగివున్న అంతర్గత నైపుణ్యాలను వెలికితీస్తే, దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలను, ఐఏఎస్ అధికారులను, ప్రముఖ క్రీడాకారులను తయారు చేయవచ్చని, మట్టిలో ఉన్న మాణిక్యాలను గుర్తించడం ఉపాధ్యాయుల బాధ్యత అని, సానపట్టిన వజ్రం ప్రకాశవంతంగా తయారవుతుందని, ఉపాధ్యాయులు ఈదిశగా ప్రయత్నించి దేశానికి కీర్తితెచ్చే అబ్దుల్ కలాం లాంటి వ్యక్తులను తయారు చేయాలని మండల విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. ఇటీవల వెలువడిన పదవతరగతి ఫలితాల్లో సింహాద్రిపురం మండలం రావులకొలను జిల్లాపరిషత్ హైస్కూలు విద్యార్థిని పల్లేటి జోషిక ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా ఫస్ట్ ర్యాంక్, అదేవిధంగా రాష్ట్రస్థాయిలో మూడవ ర్యాంకు సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని, స్థానిక మార్కెట్ ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్న పులివెందుల వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ రీజినల్ కార్యాలయంలో సీకే వెంకటనాథరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో మండల విద్యాశాఖ అధికారులు, హెడ్మాస్టర్లు ఉపాధ్యాయులు పాల్గొని టెన్త్ టాపర్ జోషికను దుశ్శాలువతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందించారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులు ప్రతిభావంతురాలైన విద్యార్థిని ఉన్నతవిద్య కోసం 15 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈసందర్భంగా జోషిక మాట్లాడుతూ, తాను సుంకేసుల గ్రామానికి చెందిన పల్లేటి హరినాథరెడ్డి, హేమలత దంపతులకు నిరుపేద కుటుంబంలో జన్మించానని, తల్లిదండ్రుల ప్రోత్సాహం, రావులకొలను హైస్కూల్ హెడ్మాస్టర్ అంకన్న నిరంతర పర్యవేక్షణ, పాఠశాల ఉపాధ్యాయుల అవిరళ కృషి, తన కఠోరశ్రమ వలన తాను ఈరోజు 595 మార్కులు సాధించి, టాపర్ గా నిలిచానని, ట్రిపుల్ ఐటీ నూజివీడులో ఇంజనీరింగ్ పూర్తిచేసి, సివిల్స్ రాసి కలెక్టర్‌గా, జిల్లాఉన్నతాధికారిగా పనిచేసి, ప్రజాసేవ చేయాలననేది తన ఆశయమని, తన విజయానికి అన్నివిధాలా సహకరించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహచరుల తోడ్పాటును తనజీవితంలో ఎప్పటికీ మరువలేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు చంద్రశేఖరరావు, రామానాయుడు, లింగాల మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాసులురెడ్డి, రామకృష్ణయ్య, తొండూరు సీనియర్ ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ సికే వెంకటనాథరెడ్డి, రావులకొలను హై స్కూలు ఉపాధ్యాయుడు ఈశ్వరరెడ్డి పులివెందులశాఖ గౌరవాధ్యక్షులు వెంకటరెడ్డి, గోపాల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, సురేష్ రెడ్డి, రఘునాథరెడ్డి, పవన్, ఓబుల్ రెడ్డి, జగన్, కరుణాకర్ రెడ్డి, మదార్, ఈశ్వరయ్య, సతీష్, సుదర్శన్, నియోజకవర్గంలోని వివిధ మండలాల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రమణీయం స్వామివార్ల స్వర్ణరథోత్సవం





**శ్రీశైలం, మే 2 (జనస్వరం) :** ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలమహాక్షేత్రంలో ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మల్లికార్జునస్వామి వారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వర్ణ రథోత్సవాన్ని కనుల పండువలా నిర్వహించారు. వేకువజామున అర్చక వేదపండితులు పంచామృతాభిషేకాలతోను, వివిధ రకాల ఫలోదకాలు, శుద్ధజలాలతో స్వామివారిని అభిషేకించి మహా బిల్వార్చన, పుష్పార్చన నిర్వహించారు. తదుపరి లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ మహా సంకల్పం, శాంతిమంత్రాలు పఠించారు. అనంతరం స్వర్ణరథంపై భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులను అధిష్టింప చేసి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, మంగళహారతులు సమర్పించారు. ఆలయ మహాద్వారం గుండా నాలుగు మాడవీధుల్లో స్వామి, అమ్మవార్లు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. స్వర్ణ రథోత్సవంలో ఆశీనులైన స్వామి అమ్మవార్లను తిలకించేందుకు స్థానికులు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వర్ణరథోత్సవాన్ని ప్రతిమాసంలో ఆరుద్ర నక్షత్రం రోజున నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. స్వర్ణరథోత్సవం ముందు వివిధాకళాకారుల నృత్యాలు, కోలాటాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

## లోకకల్యాణం కోసం రుద్రమూర్తికి పంచామృతాభిషేకం





**శ్రీశైలం, మే 2 (జనస్వరం) :** శ్రీశైలమహాక్షేత్రంలోని రుద్రపార్కులో ప్రతిష్టించిన రుద్రుని విగ్రహానికి శుక్రవారం ఉదయం లోక కల్యాణం కోసం శాస్త్రోక్తంగా పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు. 2009లో జలప్రళయం పునరావృతం కాకుండా ఉండేందుకు గాను శ్రీశైలం జలాశయం ఆనకట్టను చూస్తూ ఉండే విధంగా రుద్రుని విగ్రహాన్ని అధ్యాత్మికవేత్తల సూచనల మేరకు ప్రతిష్టించారు. అప్పటినుండి ప్రతి ఏటా రుద్రునికి పంచామృతాలతో అభిషేకాలను నిర్వహిస్తున్నామని కార్యనిర్వాహణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. గందోధకమ్, భస్మోదకం, పుష్పోదక సుగంధో దకాలతో పూజలు నిర్వహించి తదుపరి పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచదార కొబ్బరికాయల ఫలోదకాలతో రుద్రుడికి అర్చక వేదపండితులు మంత్రోచ్చారణలతో అభిషేకం నిర్వహించారు. అదేవిధంగా బిల్వార్చన, పుష్పార్చనలో భాగంగా ఐదు రకాల పుష్పాలతో విశేషపూజలు నిర్వహించారు.

# అమరావతి 2.0.. జయహెూ..

(మొదటిపేజీ తరువాయి)

చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు.

**అభివృద్ధి వికేంద్రీకరణే లక్ష్యం :**

"అమరావతినే కాదు రాష్ట్రంలోని 26 జిల్లాలనూ అభివృద్ధి చేస్తాం. 2027 నాటికి కేంద్రం సహకారంతో పోలవరాన్ని పూర్తిచేస్తాం. నదుల అనుసంధానం చేస్తాం. విశాఖను నాలెడ్జ్, ఫైనాన్షియల్ కేపిటల్‌గా చేస్తాం. గూగుల్, టీసీఎస్ వంటి దిగ్గజ కంపెనీలు విశాఖకు వచ్చాయి. భోగాపురం విమానాశ్రయం పూర్తిచేయడంతో పాటు విశాఖపట్నం స్టీల్ ఫ్యాక్టరీని బలోపేతం చేస్తాం. ఇప్పటికే కేంద్రం రూ.11,440 కోట్ల ఆర్థికసాయం చేసింది. విశాఖకు రైల్వే జోన్ కేటాయించింది. వెనకబడిన రాయలసీమను హార్టీకల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. డిఫెన్స్ ఇండస్ట్రీలు రానున్నాయి. కర్నూలులో హైకోర్టు బెంచి ఏర్పాటు చేస్తాం. రామాయపట్నంలో బీపీసీఎల్ రిఫైనరీ వస్తుంది. తిరుపతిని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం.

**హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా అమరావతి :**

"విధ్వంస పాలన ముగిసి 2024 ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చింది. ప్రజలు ఏకపక్షంగా ఇచ్చిన తీర్పుతో అమరావతి మళ్లీ ఊపిరి పోసుకుంది. ప్రజల ఆశీస్సులతో నాలుగోసారి సీఎం అయ్యాను. కానీ ఆర్థికపరిస్థితి అగమ్యగోచరంగా ఉంది. వెంటిలేటర్‌పై ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను ఎలా బయటకు తీసుకురావాలన్న ఆలోచనలో ఉన్నప్పుడు కేంద్రం, వ్యక్తిగతంగా మోదీ ముందుకొచ్చి ఆపన్నహస్తం అందించారు. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని అక్కడి నుంచి బయటకు తీసుకొచ్చారు. కేంద్రం సహకారంతో 10 నెలల్లో అమరావతిని గాడినపెట్టాం. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాన్ని విధ్వంసం నుంచి వికాసం వైపు నడిపిస్తున్నాం. ఈ రోజు వర్షం వస్తుందని అనుకున్నాం. మోదీ రావడంతో వర్షం కూడా వెనక్కి తగ్గింది. తన 25 ఏళ్ల రాజకీయ జీవితంలో వాతావరణం అనుకూలించక ఏ ఒక్క కార్యక్రమం కూడా రద్దు అయిన దాఖలా లేదని మోదీ చెప్పారు. మంచి సంకల్పం ఉంటే ప్రకృతి కూడా సహకరిస్తుందనడానికి ఇదే నిదర్శనం. ప్రపంచస్థాయి సంస్థల ఏర్పాటుతో అమరావతి హెల్త్, ఎడ్యుకేషన్ హబ్‌గా ఉండబోతోంది."

**జపాన్ మియావాకీ ఆదర్శం.. :**

"రాజధానిని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం. ప్రతి పౌరుడూ 'నా రాజధాని అమరావతి' అని గర్వంగా చెప్పుకొనేలా నిర్మిస్తాం. రాజధానిలో 30 శాతం పచ్చదనం ఉండేలా ప్రణాళికలు రూపొందించాం. నవ నగరాలు.. భూగర్భంలోనే విద్యుత్ ఇతరత్రా పైపులు వెళ్లేలా డిజైన్ చేశాం. ఔటర్ రింగ్ రోడ్డు, ఇన్నర్ రింగ్ రోడ్డు.. గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేస్తున్నాం. అన్ని ప్రధాన నగరాలను అమరావతికి అనుసంధానం చేస్తాం. 5లక్షల మంది విద్యార్థులు అమరావతిలో చదువుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రధాని మోదీ ఇదే కోరారు. రాజధానిలో మంచి విద్యా సంస్థలను ఏర్పాటు చేసి భావి తరాలను తీర్చిదిద్దండని సూచన చేశారు. దాన్ని ఆచరణలో పెడుతున్నాం. ఇప్పటికే చాలా విద్యా సంస్థలు వచ్చాయి. త్వరలో బిట్స్ పిలానీ, ఎక్స్ఎల్ఆర్ఐ బిజినెస్ స్కూల్, గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్, రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నాం. జపాన్ మియావాకీని ఆదర్శంగా తీసుకుని రాజధానిని పచ్చదనంతో ఆహ్లాదంగా తీర్చిదిద్దుతాం. ఈ రోజు రూ.49వేల కోట్ల విలువైన 74 పనులను ప్రారంభించుకోవడంతో పాటు మరో రూ.8వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసుకున్నాం. ఇది రాజధానికి పునరుజ్జీవం. ఇప్పుడు శంకుస్థాపన చేస్తున్న ప్రధాని చేతుల మీదుగానే మళ్లీ మూడేళ్ల తర్వాత ఈ పనులు ప్రారంభోత్సవాలు చేయిద్దాం."

**టెక్నాలజీ అంటేనే మోదీ :**

దేశానికి సరైన సమయంలో లభించిన సరైన నాయకుడు మోదీ. మోదీ అధికారంలోకి వచ్చిన 2014లో ప్రపంచ ఆర్థికవ్యవస్థలో మన దేశానిది 10వ స్థానం. 11 ఏళ్లలో మోదీ 5వ స్థానంలోకి తీసుకొచ్చారు. ఈ ఏడాది జపాన్‌ను అధిగమించి 4వ స్థానానికి వస్తామని, 2027 నాటికి జర్మనీని అధిగమించి 3వ స్థానానికి వస్తామని ఐఎంఎఫ్ గణాంకాలు చెబుతున్నాయి. ఇటీవల కేంద్ర కేబినెట్‌లో మోదీ కులగణన అనే విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. ఇది దేశంలో వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి ఎంతో దోహదపడుతుంది. టెక్నాలజీ అంటే మోదీ. ఆయన జన్‌ధన్ ఖాతాలు, యూపీఐ ద్వారా నగదు రహిత లావాదేవీలు వంటి ఎన్నో వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. ఇటీవలే జాతీయ క్వాంటమ్ మిషన్‌ను ప్రారంభించారు. ఆయన స్ఫూర్తితో అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా తీర్చిదిద్దుతాం. అందులో భాగంగా ఈ రోజే టీసీఎస్, ఐబీఎం వంటి సంస్థలతో ఎంవోయూలు చేసుకున్నాం. ఏఐను ప్రోత్సహించే విధంగా కార్యాచరణ అమలు చేస్తున్నాం.

**అవకాశాల రాజధాని :**

"రాజధాని అమరావతి ప్రపంచస్థాయి, సర్వశ్రేష్ఠ రాజధానిగా నిలుస్తుంది. కేవలం ఆర్కిటెక్చర్, కాంక్రీట్ జంగిల్‌లా కాకుండా... జవాబుదారీతనానికి, న్యాయానికి, ప్రజాస్వామ్యానికి ప్రతీకగా నిలుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రధాని మోదీ కలిసి అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతారు. మన యువత ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నై, హైదరాబాద్‌లాంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా... అమరావతే అవకాశాల రాజధానిగా నిలుస్తుంది"... అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఉద్ఘాటించారు. రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలు, జగన్ హయాంలో వారు ఎదుర్కొన్న కష్టాలను ప్రస్తావిస్తూ ఉద్వేగంగా ప్రసంగించారు. ముఖ్యాంశాలు..

**నాడు చెప్పాం.. నేడు చేస్తున్నాం :**

అప్పట్లో దివి సీమ తుఫాను వచ్చి అందరి ఆశలు తుడిచిపెట్టినట్లు... గత ప్రభుత్వం రాష్ట్ర భవిష్యత్తు, అమరావతి భవిష్యత్తును తుడిచిపెట్టింది. అమరావతి అంటే పరదాలు, సెక్షన్ 30, సెక్షన్ 144 మాత్రమే గుర్తుకు వచ్చేలా చేసింది. రాజధాని కోసం 34వేల ఎకరాలు ఇచ్చిన 29వేల పైచిలుకు రైతులు గత ఐదేళ్లు నలిగిపోయారు. రోడ్ల మీదకు వచ్చారు. ముళ్ల కంచెల మధ్య కూర్చున్నారు. లాఠీ దెబ్బలు తిన్నారు. కేసులు ఎదుర్కొన్నారు. ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. ఇలాంటి సమయంలో... తమ కన్నీళ్లు తుడిచే వారు ఉన్నారా... మా కష్టాలు ప్రధాని మోదీకి తెలుస్తాయా అని నన్ను అప్పట్లో అడిగారు. మోదీకి తెలియకుండా ఏదీ ఉండదు... అమరావతే శాశ్వత రాజధానిగా ఉంటుందని ఆనాడే మాట ఇచ్చాం. గత ప్రభుత్వం ఈ త్యాగాన్ని అవమానించింది. మూడు రాజధానుల పేరుతో అమరావతిని అగౌరవపరిచింది. మగవాళ్లు పోరాటం ఆపివేస్తే మహిళలు ఆంధ్రుల పౌరుషం చూపించారు. మీ సాహసం, సహనం అందరికీ ప్రేరణగా నిలుస్తాయి. మీరు ఎదుర్కొన్న అవమానాలు, మీకు అయిన గాయాలు అన్నీ గుర్తున్నాయి. మరీ ముఖ్యంగా... మహిళా రైతుల పాత్ర మరిచిపోలేం. జవాబుదారీగా ఉంటాం. అప్పుడు చెప్పినట్లుగానే... ఇప్పుడు ప్రధాని చేతుల మీదుగా అమరావతి పనుల పునఃప్రారంభం జరుగుతోంది. అది కూడా... ఆదిశంకరాచార్యుడి జయంతి సందర్భంగా జరుగుతుండటం ఎంతో ఆనందం కలిగిస్తోంది. ధర్మం కోసం మనం నిలబడితే... ధర్మం మన పక్షాన నిలబడుతుంది. కేంద్రంలో, రాష్ట్రంలో స్థిరమైన ఎన్డీయే ప్రభుత్వం ఉంది. అభివృద్ధి వేగంగా సాగుతోంది.గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వని కారణంగా కేంద్రం నుంచి వచ్చే వేల కోట్లు నష్టపోయాం. ఇప్పుడు కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాలు సహకార సమాఖ్య స్ఫూర్తితో పని చేస్తున్నాయి. నేడు అమరావతి పనులతోపాటు రహదారులు, రైల్వే, పారిశ్రామిక, రక్షణకు సంబంధించిన అనేక ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపన చేస్తున్నారు. నేను ఎన్నికల సమయంలో అవనిగడ్డలో ఇచ్చిన హామీకి అనుగుణంగా మిస్సైల్ టెస్ట్ రేంజ్‌కు శంకుస్థాపన జరుగుతుండటం ఆనందంగా ఉంది.

**ప్రధానికి దుర్గమ్మ శక్తినివ్వాలి... :**

కశ్మీర్‌లో ఉగ్ర దాడి నేపథ్యంలో... క్లిష్ట సమయంలోనూ.. దేశమంతా యుద్ధంవైపు వెళ్తున్న సమయంలోనూ ప్రధాని ఇక్కడికి వచ్చారు. లోపల ఎంతో వేదన ఉన్నప్పటికీ... అమరావతి రైతులు చేసిన త్యాగాలు మరచిపోకూడదనే ఆయన ఇక్కడికి వచ్చారు. రాష్ట్రం పట్ల ఆయన నిబద్ధతకు ఇది నిదర్శనం. పహల్గాం దాడి జరిగిన రోజు... చీకటి రోజు. కశ్మీర్‌లో చిందిన నెత్తురు... దేశవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. ఉగ్రవాదులపై కఠిన చర్యలు ఉంటాయని మోదీ దేశ ప్రజలకు మాట ఇచ్చారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని నడిపిస్తున్న ప్రధానికి... కనక దుర్గమ్మ, భవానీ మాత ఆశీస్సులు, శక్తిని ఇవ్వాలని ప్రార్థిస్తున్నాను. జై భవానీ, జై భారత్, జైహింద్.

**మోదీకి దేశమే ఇల్లు.. అమరావతి రాష్ట్రానికి ఇల్లు :**

ప్రధాని మోదీ గతంలో సన్యాశ్రమ దీక్షలో ఉన్నప్పుడు 'అనికేత్' అనే పేరు పెట్టుకున్నారు. దాని అర్థం... ఇల్లు లేని వాడు, పరమ శివుడు అని అర్థం. కానీ... అలాంటి వ్యక్తి నేడు ఐదు కోట్ల తెలుగు వారి కోసం, మనందరికీ ఇల్లు లాంటి రాజధాని నిర్మాణానికి పూర్తిగా సహకరిస్తున్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు... కామాఖ్య నుంచి ద్వారక వరకు.. ఉన్న. దేశాన్నే ఆయన తన ఇల్లుగా చేసుకున్నారు.

**చంద్రబాబు విజన్.. దక్షత... :**

చంద్రబాబు విజనరీ లీడర్. ఒకప్పుడు రాళ్లు, రప్పల్లో ఒక మహా నగరాన్ని చూసిన వ్యక్తి. 20 ఏళ్ల ముందుకు వెళ్లి ఆలోచించే నాయకుడు. రాష్ట్రానికి అలాంటి నేత సీఎం కావాలని ఆకాంక్షించాం. అదే జరిగింది. చంద్రబాబు సైబరాబాద్‌ను ఎంతో అద్భుతంగా రూపకల్పన చేశారు. ఆయన అనుభవం, దక్షత, పాలనా సామర్థ్యంతో అమరావతినీ అలాగే అభివృద్ధి చేస్తారు. ఈ నగరం తెలుగు వారికే కాదు... దేశానికే తలమానికంగా ఉంటుంది.

**అమరావతి అన్‌స్టాపబుల్**

'ప్రధాని మోదీకి ఆంధ్రప్రదేశ్ పైనా.. అమరావతి పైనా.. ఎంతో ప్రేమ. ఇప్పుడు ఆయన ఢిల్లీలో ఎంత బిజీగా ఉన్నారో మనందరికీ తెలుసు. అయినా ఈ కార్యక్రమానికి వచ్చారు. మోదీ చేతుల మీదుగా అమరావతి పనులు పునఃప్రారంభమవుతున్నాయి. ఇక అమరావతికి తిరుగులేదు. అమరావతి అన్‌స్టాపబుల్' అని మంత్రి లోకేశ్ అన్నారు. వెలగపూడిలో శుక్రవారం జరిగిన అమరావతి పనుల పునఃప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 2019-24 మధ్యకాలంలో విధ్వంస పాలన నడిచింది. చంద్రబాబుపై వ్యక్తిగత కక్షతో అమరావతిని చంపాలని చూశారు. ఒక్క ఇటుక పెట్టకుండా మూడు రాజధానులంటూ ఐదేళ్లు కాలం గడిపేశారు. 1,631 రోజుల పాటు అమరావతి ఉద్యమం కొనసాగింది. 'జై అమరావతి' అన్నందుకు రైతులకు సంకెళ్లు వేశారు. మహిళా రైతుల్ని పోలీసుల బూటుకాళ్లతో తన్నించారు. 270 మంది రైతులు మృతి చెందారు. 3వేల మందిపై అక్రమ కేసులు పెట్టారు. ఎన్ని కుట్రలు చేసినా అమరావతిని మాత్రం ఆపలేకపోయారు. ఆపడానికి.. పీకడానికి అమరావతి ఎవరి ఇంట్లోనో పెంచుకున్న పెరటి మొక్క కాదు. జనం గుండెల్లో దాచుకున్న ప్రజా రాజధాని. ప్రధాని నమో శంకుస్థాపన చేసిన అమరావతిని ఆపే దమ్ము ఎవరికీ లేద'ని లోకేశ్ స్పష్టం చేశారు.. ఆయన ఇంకా ఏమన్నారంటే...

**ఏపీలో డబుల్ ఇంజన్ సర్కారు :**

రాష్ట్రంలో అభివృద్ధి వికేంద్రీకరణ జెట్‌స్పీడ్‌తో జరగబోతోంది. ఏపీ కోరిన ప్రతి కోరికను ప్రధాని మోదీ తీరుస్తున్నారు. విశాఖ రైల్వే జోన్, ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ, నక్కలపల్లి బల్క్ డ్రగ్ పార్క్‌కు శంకుస్థాపన చేశారు. విశాఖ ఉక్కును కాపాడారు. ఇప్పుడు అమరావతి అభివృద్ధికి నిధులు కేటాయించడమే కాకుండా పనులు తిరిగి ప్రారంభిస్తున్నారు. రాష్ట్ర అభివృద్ధికి అన్ని రకాలుగా సహకారం అందిస్తున్నారు. ఏపీలో ఇప్పుడు డబుల్ ఇంజన్ సర్కార్ ఉంది. ఒకపక్క నమో... మరోపక్క మన చంద్రబాబు. రెండూ పవర్‌ఫుల్ ఇంజన్లు ఉన్నాయి. ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ అభివృద్ధి, సంక్షేమం అనే జోడెద్దుల బండిని పరుగులు పెట్టిస్తున్నారు. ఒకే రాజధాని... అభివృద్ధి వికేంద్రీకరణ అజెండాతో పనిచేశాం. ఇప్పటికీ మాది అదే అజెండా.

**20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం :**

ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 10 నెలల్లోనే రూ.8 లక్షల కోట్ల పెట్టుబడులు, వాటిద్వారా 5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ఒప్పందాలు కుదర్చుకున్నాం. 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చాం. రూ.1,85,000 కోట్ల పెట్టుబడి, 57వేల మందికి ఉద్యోగాలు కల్పించే ఎన్టీపీసీ గ్రీన్ ఎనర్జీ విశాఖపట్నం రాబోతోంది. రూ.1,36,000 కోట్ల పెట్టుబడి, 55వేల ఉద్యోగాలు కల్పించే ఆర్సెల్లార్ మిట్టల్ అనకాపల్లికి వస్తోంది. రూ.97,000 కోట్ల పెట్టుబడి, 3వేల మందికి ఉద్యోగాలు కల్పించే బీపీసీఎల్ రామాయపట్నం రాబోతోంది. తిరుపతి జిల్లాకు ఎల్జీ ఎలక్ట్రానిక్స్, కర్నూలు, కడప, అనంతపురానికి రెన్యువబుల్ ఎనర్జీ, ప్రకాశానికి రిలయన్స్ సీబీజీ, ఉత్తరాంధ్రకు ఫార్మా, ఐటీ ఇలా అన్ని జిల్లాలను అభివృద్ధి చేయబోతున్నాం, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నాం.

**నమో దెబ్బలకు మ్యాప్‌లో పాక్ మిస్ :**

పాకిస్థాన్ గీత దాటింది. అమాయకుల్ని చంపి చాలా పెద్ద తప్పు చేసింది. ఒక్కటి కాదు వంద పాక్‌లు వచ్చినా భారతదేశం నేలపై మొలిచిన గడ్డి కూడా పీకలేరు. వంద పాకిస్థాన్లకు సమాధానం చెప్పే నరేంద్ర మోదీ మిస్సైల్ మనదగ్గర ఉంది. మన సింహం నమో కొట్టే దెబ్బలకు ప్రపంచ పటంలో పాకిస్థాన్ మిస్సింగ్ అని రావడం ఖాయం. పాక్‌కు దీటుగా బదులివ్వడానికి దేశం మొత్తం ప్రధానికి అండగా నిలుస్తుంది. పహల్గాం ఉగ్రదాడిలో చనిపోయిన వారికి నివాళులర్పిస్తున్నాం. వారి కుటుంబాలకు దేశం అండగా ఉంటుంది. కులగణన చేయాలని కేంద్రం తీసుకున్న నిర్ణయం ఒక సంచలనం. ఇతరులు దశాబ్దాలుగా సంకోచిస్తూ వచ్చిన కీలక అంశంపై మోదీ ధైర్యంగా నిర్ణయం తీసుకుని చరిత్రను తిరగరాశారు. అణగారిన వర్గాలకు సాధికారత కల్పించాలనే నిబద్ధతకు లోబడి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నారు. వెనుకబడిన వర్గాల సామాజిక న్యాయం కోసం దశాబ్దాలుగా చేస్తున్న పోరాటాలకు ఈ నిర్ణయం పరిష్కారం చూపుతుంది' అని లోకేశ్ పేర్కొన్నారు.

## తెలంగాణలో అమెజాన్ జీరో రిఫరల్ ఫీజులు విక్రేతల నడుమ అమిత ప్రాచుర్యం



**హైదరాబాద్, మే 2 (జనస్వరం) :** తెలంగాణలో విక్రేతల మధ్య అమెజాన్ తాజా "జీరో రిఫరల్ ఫీజు" కార్యక్రమం విశేష స్పందన తెచ్చుకుంది. రూ. 300 కంటే తక్కువ ధర ఉన్న ఉత్పత్తులపై రిఫరల్ ఫీజులను పూర్తిగా రద్దు చేయడం ద్వారా, వేలాది మంది చిన్న వ్యాపారాలు గణనీయమైన పొదుపును చేసుకుంటూ తమ వ్యాపారాలను వేగంగా అభివృద్ధి చేస్తున్నారు. ఈ సదుపాయం దుస్తులు, బూట్లు, ఫ్యాషన్ నగలు, కిరాణా, గృహాలంకరణ, వంటగది ఉత్పత్తులు, ఆటోమోటివ్, పెంపుడు జంతువుల ఉత్పత్తులు వంటి 135 విభాగాల్లో వర్తిస్తుంది. తెలంగాణలో ఇప్పటికే హెూమ్ అండ్ కిచెన్, బిజినెస్, పారిశ్రామిక, శాస్త్రీయ సామగ్రి (బీఐఎస్ఎస్), ఫర్నిచర్, క్రీడలు, హెూమ్ ఇంప్రూవ్‌మెంట్ విభాగాల్లోని విక్రేతలు ఈ ప్రయోజనాలను అనుభవిస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో 50,000కి పైగా విక్రేతలు Amazon.inలో ఉత్పత్తులను విక్రయిస్తున్నారు. వీరిలో అనేక మంది విక్రేతలు తమ ఉత్పత్తులను తక్కువ ధరలకు విక్రయిస్తూ మరింత విస్తృతమైన కస్టమర్ బేస్‌ను ఆకర్షించగలుగుతున్నారు. అమెజాన్ ఇండియా డైరెక్టర్ సేల్స్ గౌరవ్ భట్నాగర్ మాట్లాడుతూ, "తెలంగాణ విక్రేతల నుంచి మేము అద్భుతమైన స్పందనను చూస్తున్నాము. రూ.300 కంటే తక్కువ ఉత్పత్తులపై రిఫరల్ ఫీజులను తొలగించడం ద్వారా వారిని మరింత లాభదాయకమైన వ్యాపార అవకాశాల వైపు నడిపిస్తున్నాము," అని చెప్పారు. సెల్లోరియా యజమాని షేక్ అజీమ్ మాట్లాడుతూ, "సున్నా రిఫరల్ ఫీజులతో మేము మా కేటలాగ్‌ను అభివృద్ధి చేసి, ఎక్కువ యూనిట్ల అమ్మకాల ద్వారా లాభదాయకతను పెంచుకోగలిగాము. ఇది మా వ్యాపార వృద్ధికి ఎంతో దోహదపడింది," అని తెలిపారు. అమెజాన్ ఇండియా తెలంగాణలో బలమైన మౌలిక సదుపాయాలను నిర్మించింది. రాష్ట్రవ్యాప్తంగా 6 ఫుల్ఫిల్మెంట్ కేంద్రాలు, 1 సార్టేషన్ కేంద్రం, 70 డెలివరీ స్టేషన్లు, 1800కి పైగా 'ఐ హేవ్ స్పేస్' భాగస్వామి స్టోర్లు ఉన్నాయి. ఇది వేగవంతమైన, విశ్వసనీయమైన డెలివరీ సేవలను వినియోగదారులకు అందించడంలో సహాయపడుతోంది. అదనంగా, అమెజాన్ తన విక్రేతలకు మెరుగైన లిస్టింగ్, అమ్మకాల కోసం జనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ టెక్నాలజీలను వినియోగిస్తోంది. ఉత్పత్తి వివరాలను మెరుగుపరచడం ద్వారా విక్రేతలకు మార్కెట్లో మెరుగైన గమనికను అందిస్తోంది. మొత్తం మీద, అమెజాన్ ఇండియా తీసుకొచ్చిన ఈ జీరో రిఫరల్ ఫీజు విధానం తెలంగాణ రాష్ట్రంలో చిన్న వ్యాపారాల వృద్ధికి కొత్త దిక్సూచి అవుతోంది.

## ఉన్నత విద్యలో 2035 నాటికి 50 శాతం స్థూల నమోదు నిష్పత్తి

**- లక్ష్య సాధనలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాల పాత్ర కీలకం**

**- ఏఐసీటీఈ చైర్మన్**




**హైదరాబాద్, మే 2 (జనస్వరం) :** ఉన్నత విద్యలో 2035 నాటికి 50 శాతం స్థూల నమోదు నిష్పత్తిని (Gross Enrollment Ratio) సాధించడంలో ప్రైవేట్ విశ్వవిద్యాలయాల పాత్ర కీలకమని ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ) చైర్మన్ ప్రొఫెసర్ టి.జి. సీతారాం స్పష్టంచేశారు. మహీంద్రా యూనివర్సిటీ ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ ఆధ్వర్యంలో, ఇండియన్ ప్రైవేట్ యూనివర్సిటీల సమాఖ్య (సీఐయూపీ) ఆధ్వర్యంలో నిర్వహించిన "భారత్ హయ్యర్ ఎడ్యుకేషన్ సమిట్ 2025" (బీహెచ్ఈఎస్ 2025) సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిణామాలు వేగంగా మారుతున్న నేపథ్యంలో ఉన్నత విద్యా సంస్థలు దూరదృష్టి గల నాయకులను తీర్చిదిద్దాల్సిన బాధ్యతను భుజాలపై వేసుకోవాలని సీతారాం పేర్కొన్నారు. నేషనల్ ఎడ్యుకేషనల్ పాలసీ 2020 (ఎన్ఈపీ 2020) విద్యా రంగాన్ని ఒక సమన్విత, విమర్శాత్మక ఆలోచనను ప్రోత్సహించే దిశగా నడిపిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా మహీంద్రా యూనివర్శిటీ ఛాన్సలర్ ఆనంద్ మహీంద్రా ప్రసంగాన్ని డాక్టర్ మెదూరి చదివి వినిపించారు. ఆనంద్ మహీంద్రా తన ప్రసంగంలో భవిష్యత్తు తరాల కోసం మార్గం వేయడంలో ఈ సమిట్ ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. భారతదేశం గ్లోబల్ నాలెడ్జ్ ఎకానమీలో ముందంజలో ఉండేందుకు అన్ని రంగాల వారూ కలసి పని చేయాలని పిలుపునిచ్చారు. సమిట్ విద్యా రంగం, పరిశ్రమ నేతలు, పాలసీ మేకర్ల మధ్య కీలక చర్చలకు వేదికగా నిలిచిందని అధికారులు తెలిపారు. భారత ఉన్నత విద్య వ్యవస్థను మారుస్తున్న ప్రయాణంలో ఈ చర్చలు ఎంతో ప్రాధాన్యతను సంతరించుకున్నాయని పేర్కొన్నారు. ప్రొఫెసర్ సీతారాం మాట్లాడుతూ, ప్రపంచ స్థాయిలో ఆలోచించే, మార్గదర్శకులైన, నిర్భయమైన నాయకులను భారతదేశం తయారు చేయాల్సిన అవసరం ఉందని, ఉన్నత విద్యను గ్లోబల్ స్టాండర్డ్స్‌కు అనుగుణంగా తీర్చిదిద్దాల్సిన అవసరముందని అన్నారు. దేశీయ జ్ఞాన సంపదను, డిజిటల్ ఆవిష్కరణలను, అనుభవాత్మక విద్యా పద్ధతులను స్వీకరించాల్సిన అవసరాన్ని కూడా హైలైట్ చేశారు. ఈ సందర్భంగా మహీంద్రా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, సీఐయూపీ దక్షిణ భారత మండలి అధ్యక్షులు ప్రొఫెసర్ యాజులు మెదూరి మాట్లాడుతూ, ప్రపంచ ప్రమాణాలకు అనుగుణంగా సమాజ పట్ల చైతన్యం కలిగిన భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దే అంశంపై ఈ సమితి చర్చించడం మహీంద్రా యూనివర్శిటీకి గర్వకారణమని తెలిపారు.

## షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ



**హైదరాబాద్, మే 2 (జనస్వరం) :** జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ శుక్రవారం యూసఫ్‌గూడ డివిజన్ వెంకటగిరిలో షైక్ పేట్, యూసఫ్‌గూడ డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి పథకాల కింద చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా, 8 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.3,60,000 విలువైన చెక్కులు, మరో 39 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మొత్తం రూ.39,04,524 విలువైన చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో షైక్ పేట్ మండల రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, యూసఫ్ గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్, షైక్ పేట్ డివిజన్ అధ్యక్షుడు ప్రదీప్ కుమార్, యూసఫ్ గూడ డివిజన్ ప్రెసిడెంట్ సంతోష్ ముదిరాజ్, నర్సింగ్ దాస్, అజర్, అజాం, ఫహీం, గణేష్, శరత్, అరుణ, అమ్మాజీ, రేణుక, అశోక్, ప్రసన్న, సాయిలక్ష్మి, రవి గౌడ్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మాగంటి గోపీనాథ్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అండగా నిలవడమే లక్ష్యమని తెలిపారు. ప్రతి ఒక్కరి సమస్యను శ్రద్ధగా పరిశీలించి, మరింత మందికి సహాయం అందించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

## దేగాం గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**భైంసా, మే 2 (జనస్వరం) :** రైతులు కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని న్యాయమైన మద్దతు ధరకు విక్రయించేందుకు, రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో దేగాం గ్రామంలో కొత్తగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించారు. ఈ కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించిన స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ పటేల్ మాట్లాడుతూ, రైతులు మధ్యవర్తులను నమ్మి మోసపోకుండా, ప్రభుత్వమే ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా తమ ధాన్యాన్ని విక్రయించాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం, "ఏ" రకం వరికి క్వింటాల్‌కు రూ.2320, "బి" రకం వరికి రూ.2300 మద్దతు ధరగా ఉండనుందని తెలిపారు. ప్రభుత్వ ధరలకు ధాన్యం విక్రయించడం ద్వారా రైతులు న్యాయమైన ఆదాయం పొందగలరన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ఎంపీపీ రజాక్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ లింగన్న, కమిటీ సభ్యులు, బీజేపీ మండల అధ్యక్షురాలు సుష్మా రెడ్డి, మాజీ జడ్పీటీసీ సోలంకే భీమ్ రావు, నాని లక్ష్మణ్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని, ప్రభుత్వ ధరణి బలోపేతం చేయాలని నేతలు ఆకాంక్షించారు.

## ప్రధాని సభకు తరలి వెళ్లిన జనసైనికులు




**వేమూరు(భట్టిప్రోలు), మే 2 (జనస్వరం) :** రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమానికి వేమూరు మండలం నుండి ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి సోమరవుతు అనురాధ ఆధ్వర్యంలో పలు గ్రామాల నుండి వాహనాలలో రాజధాని తరలి వెళ్లారు. రాజధాని అమరావతి అభివృద్ధి పనుల పునఃప్రారంభం, ప్రధాని నరేంద్ర మోడి పర్యటనకు జిల్లా జనసేన నాయకుల ఆదేశాల మేర వేమూరు మండలంలోని కుచ్చెర్లపాడు వెళ్ళబాడు వరాహపురం కాకర్లమూడి చదలవాడ తదితర గ్రామాల నుండి భారీ జన సందోహం పలు వాహనాలలో భారీగా తరలివెళ్లడం జరిగింది.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తరలి వెళ్లారు.ఈ కార్యక్రమంలో తాడికొండ కోటేశ్వరరావు,గూ డపాటి పద్దయ్య, పెరికల రవి తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే అమరావతికి మళ్లీ జీవం

**- పీఎం మోదీకి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)**

**- గన్నవరం విమానాశ్రయంలో పీఎం మోదీకి వీడ్కోలు పలికిన ఎంపీ కేశినేని**

**- బహిరంగ సభను విజయవంతం చేసినందుకు ప్రజలకు కృతజ్ఞతలు**



**గన్నవరం, మే 2 (జనస్వరం) :** అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులకి శంకుస్థాపన చేసేందుకు శుక్రవారం విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎంపీ కేశినేని శివనాథ్ స్వాగతం పలికారు. అలాగే కార్యక్రమం అనంతరం గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి ఢిల్లీ బయలుదేరిన ప్రధాన మంత్రి మోదీకి సీఎం చంద్రబాబుతోపాటుగా సహచర ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఎంపీ కేశినేని శివనాథ్ ఘనంగా వీడ్కోలు పలికారు. అమరావతిలో మౌలిక వసతుల కల్పనతో పాటు రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సహకారం కొనసాగుతుందని స్పష్టం చేసిన ప్రధానమంత్రి మోదీకి ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ధన్యవాదాలు తెలిపారు. అలాగే డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే అమరావతికి మళ్లీ జీవం వచ్చిందంటూ, ఏపీ రాజధాని అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్సవ సభ గ్రాండ్ సక్సెస్ చేసినందుకు రాష్ట్ర ప్రజలకు ఎంపీ కేశినేని శివనాథ్ కృతజ్ఞతలు తెలియజేశారు.

## పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఘన సత్కారం

**హైదరాబాద్, మే 2 (జనస్వరం) :** పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను సోమాజిగూడ మౌంట్ హెలికాన్ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా సత్కరించారు. ఈ ఏడాది పరీక్షల్లో విద్యార్థులు నరేంద్ర 536 మార్కులతో, రమ్యా 526 మార్కులతో, ప్రణవి 520 మార్కులతో, గీతికా 508 మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. వారందరూ తమ ప్రతిభను ప్రతిష్టాత్మకంగా చాటారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌లు సాంబశివరావు, సంపత్ కుమారి మాట్లాడుతూ, "విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శనం, తల్లిదండ్రుల సహకారం వలననే ఈ విజయాలు సాధ్యమయ్యాయి," అన్నారు. విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వారు హార్థిక అభినందనలు తెలిపారు. స్కూల్‌లో ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, స్మృతిచిహ్నాలు అందజేశారు.



# శవం కనిపిస్తే చాలు... వైఎస్ జగన్ రాబందులా వాలిపోతారు

- ఐదేళ్ల పాలనలో స్వరూపానంద సూచనలతో దేవాదాయ శాఖను భ్రష్టు పట్టించారు
- సింహాచలంలో అనువంశిక ధర్మకర్తను తప్పించి చరిత్ర హీనులయ్యారు
- ఇప్పుడేమో వైఎస్ జగన్ మొసలి కన్నీరు కారుస్తున్నారు
- మాజీ సీఎం జగన్‌పై "తెలుగు శక్తి" విమర్శనాస్త్రాలు

**విశాఖపట్నం, మే 2 (జనస్వరం) :** ఇప్పటివరకు రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతం రాజు సుధాకర్‌పై విమర్శనాస్త్రాలు సంధించిన తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్.. తాజాగా మాజీ సీఎం జగన్ రెడ్డిని టార్గెట్ చేశారు. తనదైన శైలిలో నిప్పులు చెరిగారు. దేవదాయ శాఖను, సింహాచలన్నీ భ్రష్టు పట్టించిన జగన్ రెడ్డి శవ రాజకీయాలు చేయడం ఆయనకే చెల్లిందని విమర్శించారు. శుక్రవారం దాబా గార్డెన్స్‌లోని వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలను ఐదేళ్లపాటు పీడించుకుతున్న జగన్ రెడ్డి సర్కారు శారదా పీఠానికి అధిపతిని అని చెప్పుకున్న స్వరూపానంద సేవలో తరించిందన్నారు. దేవదాయశాఖ కార్యకలాపాలు మొత్తం స్వరూపానంద చేతికి వెళ్ళాయని ఆరోపించారు. చివరకు.. స్వరూపానంద సూచనలతోనే ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలం దేవస్థానం అనువంశిక ధర్మకర్తను కూడా మార్చేసిన నీచమైన చరిత్ర జగన్ రెడ్డిదన్నారు. తద్వారా మనోభావాలు దెబ్బతిన్న భక్తుల దృష్టిలో జగన్ చరిత్ర హీనుడిగా మిగిలిపోయారన్నారు. ఇప్పుడు అటువంటి వ్యక్తి సింహాచలం ఘటనపై మొసలి కన్నీరు కార్చడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా ఉందన్నారు. సింహాచల చరిత్రలో ఎప్పుడూ కూడా అవాంఛనీయ ఘటన సంభవించలేదని ప్రకృతి విపత్తు కారణంగా బలమైన ఈదురు గాలులు, భారీ వర్షానికి సింహాచలంలో గోడ కూలిపోయిందన్నారు. మరోవైపు ఇదే అంశంపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ విచారణ కూడా కొనసాగిస్తోందని తెలిపారు.



ప్రభుత్వం బాధిత కుటుంబాలను ఆదుకుని వారి కన్నీటిని తుడిచే ప్రయత్నం చేస్తున్న సమయంలో మాజీ సీఎం, మానసిక రోగి.. జగన్ రెడ్డి ఒక రాబందులా వాలిపోయారన్నారు. ఇప్పుడే కాదు ఏ ఘటనలో ఎవరు ప్రాణాలు కోల్పోయినా.. తనకు లాభం ఉంటుందంటే జగన్ రాబందులా వాలిపోతారని తీవ్ర వ్యాఖ్య చేశారు. అసలే బాధలో ఉన్న బాధిత కుటుంబాల వద్దకు వెళ్లి.. పుండు మీద కారం జల్లే విధంగా వ్యవహరించారని బి.వి.రామ్ విమర్శించారు. జగన్ తానా అంటే తందానా అన్నట్టు.. బొత్స సత్యనారాయణ, కోడిగుడ్ల శాఖ మాజీ మంత్రి గుడివాడ తదితరులు డ్రామాను మరింతగా రక్తి కట్టిస్తున్నారన్నారు. ఇప్పటికైనా శవ రాజకీయాలు మాని హుందాగా ప్రవర్తించాలని వైసీపీ నేతలకు హితవు పలికారు. ఏది ఏమైనప్పటికీ సింహాచలంలో సంభవించిన దుర్ఘటన అత్యంత బాధాకరమని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రామ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

**పరిహారం అధికారుల నుంచే వసూలు చేయాలి :**

సింహాచలం ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారికి పరిహారం రూ.25 లక్షలు కాకుండా రూ.50 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పరిహారం బాధ్యులైన అధికారుల నుంచే వసూలు చేయాలన్నారు. దేవస్థానంలో పనిచేస్తున్న వారిలో అనేక మందికి సర్టిఫికెట్స్ కూడా లేవన్నారు. డిప్యూటీ ఇంజనీర్ శ్రీహరి రాజు క్లీనర్‌గా, ఎగ్జ్ క్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు ఎన్.ఎం.ఆర్‌గా గతంలో పనిచేసేవారన్నారు. ఇంచార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న రామచంద్ర మోహన్ అవినీతి పరుడన్నారు.

**పల్లా ఆదివారం ఉదయం 11 గంటల హోటల్ దశపల్లాలో చర్చకు సిద్ధం :**

తనను వైసీపీ కోవర్ట్ అని రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ఆరోపించారని.. ఇదే విషయమై శుక్రవారం చర్చకు సిద్ధమని ప్రకటించానన్నారు. అయితే పల్లా గాని అతని అనుచరులు గాని వేదికను ఏర్పాటు చేయలేదన్నారు. ఈ నేపథ్యంలోనే ఆదివారం 11 గంటల హోటల్ దశపల్లాలో చర్చకు సిద్ధంగా ఉంటానన్నారు. అప్పుడు కూడా చర్చకు రాకపోతే మాత్రం కోవర్ట్ అంశాన్ని నెక్స్ట్ లెవెల్‌కు తీసుకు వెళతానని రామ్ తెలిపారు.

**ఎమ్మెల్యే వంశీతో బి.వి.రామ్ భేటీ :**




విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్‌తో శుక్రవారం భేటీ అయ్యారు. దక్షిణ నియోజకవర్గంలో మీ స్థాయిని తగ్గించేందుకు ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్ ప్రయత్నం చేస్తున్న విషయం.. టీడీపీ, జనసేనల అధినేతలకు తెలియజేయాలని.. ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌కి రామ్ సూచించారు. ఈ విషయంపై తాను కూడా ప్రత్యేకంగా దృష్టి పెడతానని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలియజేశారని రామ్ పేర్కొన్నారు.

# అమరావతి పునఃప్రారంభానికి ప్రజల భారీ భాగస్వామ్యం

### ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో విశేష స్పందన




**ఇబ్రహీంపట్నం, మే 2 (జనస్వరం) :** మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పిలుపు మేరకు అమరావతి పనుల పునఃప్రారంభ కార్యక్రమానికి నియోజకవర్గ నలుమూలల నుంచి ప్రజలు పెద్దఎత్తున తరలివెళ్లారు. విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకానున్న సభకు బయలుదేరుతున్న బస్సులను శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే సందర్శించి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా వారికి అందుతున్న సౌకర్యాలను పరిశీలించి, అవసరమైన ఆహార పదార్థాలు, శీతల పానీయాలను అందజేశారు. ప్రజలు పునఃప్రారంభోత్సవాన్ని హర్షంతో స్వాగతిస్తూ, తమ భవిష్యత్తు కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తీసుకుంటున్న నిర్ణయాలను అభినందించారు. ముఖ్యంగా మైలవరం నియోజకవర్గం అమరావతిలో భాగస్వామ్యమవుతున్నందుకు గర్వంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రాంత అభివృద్ధి కోసం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఎండ తీవ్రతను తలచుకోకుండా అమరావతిపై ఉన్న ప్రేమతో భారీగా తరలివచ్చిన ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఉత్సవంలో ఎన్డీఏ కూటమి కుటుంబ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చింతపల్లిలో పాక్షికంగా మన్యం బంద్

### గిరిజన స్పెషల్ డీఎస్సీ కూటమి ఏర్పాటు కోసం డిమాండ్





**చింతపల్లి, మే 2 (జనస్వరం) :** గిరిజనుల నిరుద్యోగ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక గిరిజన డీఎస్సీ కూటమిని ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో అఖిలపక్ష నాయకుల పిలుపుపై శుక్రవారం చింతపల్లిలో పాక్షికంగా మన్యం బంద్ నిర్వహించారు. ఈ సందర్భంగా బంద్‌కు మద్దతుగా పలుచోట్ల వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా మూసి వేసినట్లు కనిపించింది. ఉదయం నుండే స్థానిక అఖిలపక్ష నాయకులు, గిరిజన సంఘాల ప్రతినిధులు బంద్‌ను అమలు చేయడంలో చురుగ్గా పాల్గొన్నారు. చింతపల్లి పట్టణంలో కొన్ని షాపులు, వ్యాపార కేంద్రాలు మూసివేయబడగా, కొన్ని ప్రాంతాల్లో బంద్ ప్రభావం తక్కువగా కనిపించింది. రోడ్లపై స్వల్పంగా ఆటో, రిక్షాలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు కొనసాగాయి. బంద్‌కు మద్దతుగా ప్రదర్శనలు నిర్వహించిన నాయకులు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో నిరుద్యోగం తీవ్రమైన స్థాయిలో ఉంది. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేకంగా గిరిజన డీఎస్ కూటమిని ప్రభుత్వం తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసు శాఖ బంద్ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు తగిన ఏర్పాట్లు చేసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని పోలీసులు తెలిపారు.

# కిషోర్ బాలికల సాధికారమే సమాజ అభివృద్ధికి పునాది

- తల్లిదండ్రులు, గ్రామస్తులు ఐక్యంగా ముందుకు రావాలి
- చింతపల్లి ఐసీడీఎస్ అధికారిణి వెంకటరమణి






**చింతపల్లి, మే 2 (జనస్వరం) :** వేసవి సెలవుల్లో కిషోర్ బాలికల అభివృద్ధి, రక్షణ, సాధికారత కోసం తల్లిదండ్రుల తోపాటు గ్రామస్థాయిలో సమిష్టి చొరవ అవసరమని ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి జి.వెంకటరమణి అన్నారు. మండలంలోని గొందిపాకల సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన "కిషోర్ వికాసం" అవగాహన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు తాంబేలీ మోహన్ రావుతో కలిసి ఆమె కిషోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "12 నుంచి 19 ఏళ్ల వయసు బాలికలు వేసవి సెలవుల్లో తల్లిదండ్రుల సమక్షంలో ఉండేలా చూసుకోవాలి. బంధువుల వద్దకు వెళ్లే బాలికలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం. బాలల వివాహాల నివారణలో గ్రామస్థుల భాగస్వామ్యం అత్యంత కీలకం" అని పేర్కొన్నారు. బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యంపై సుదీర్ఘ చర్చలు జరగగా, పాల్గొన్న తల్లిదండ్రులకు బహుళ మాధ్యమాల ద్వారా అవగాహన కల్పించారు. కిషోర్ బాలికల భవిష్యత్తు కోసం సమాజం మొత్తం బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ అదనపు ప్రాజెక్టు అధికారిణి ఎం.రామలక్ష్మి, సచివాలయ మహిళా సంరక్షకురాలు వనము రత్నాకుమారి, సూపర్వైజర్ విజయ కుమారి, అంగన్వాడి కార్యకర్తలు, గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి : తులసి రెడ్డి



**పులివెందుల, మే 2 (జనస్వరం) :** గాలి, వానకు నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రాజ్యసభ మాజీ సభ్యులు, ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్ తులసి రెడ్డి, పులివెందుల అసెంబ్లీ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త ధ్రువ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధ, గురువారాలలో వీచిన పెను గాలులకు, వర్షానికి నియోజకవర్గంలో వేంపల్లి మండలంలో దెబ్బతిన్న అరటి పంటలను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు దెబ్బతిన్న అరటి తోటలను పరిశీలించి రైజులతో, కౌలు రైతులతో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు, ధర లేక పోవడంతో తాము తీవ్రంగా నష్టపోయామని రైతులు కాంగ్రెస్ నాయకులకు చెప్పారు. ఎకరాకు రూ.రెండు లక్షల వరకు పెట్టుబడి పెట్టామని, పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షానికి, పెను గాలికి పూర్తిగా నేలమట్టైందని ప్రభుత్వం ఉదారంగా ఆదుకోకపోతే ఆత్మహత్యే తమకు శరణ్యమని కౌలు రైతులు రామ గంగి రెడ్డి, గజ్జల ఈశ్వర్ రెడ్డి వాపోయారు. ప్రభుత్వం ఎకరాకు కనీసం రూ.50 వేలు పెట్టుబడి సాయం అందించాలని, అరటి పిలకలను ఉచితంగా సరఫరా చేయాలని తులసి రెడ్డి, ధ్రువ కుమార్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రమణ్యం,వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, అమర్‌నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రి నాథ్, వేమారాజా, వేమయ్యా, నాగరాజు, రమణ, వినయ్, మహేష్, అశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# మన్యం బంద్ విజయవంతం




**విఆర్ పురం, మే 2 (జనస్వరం) :** ఏజెన్సీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, ఏజెన్సీలో నూరు శాతం ఉద్యోగాలు గిరిజనులతో భర్తీ చేయాలని, సీఎం చంద్రబాబు గత ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రేకపల్లి జంక్షన్ వద్ద ఆదివాసి గిరిజన సంఘం, ఆదివాసీ జేఏసీ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన రాష్ట్ర ఏజెన్సీ బంద్ విజయవంతం అయ్యింది. బంద్ నేపథ్యంలో దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. ప్రభుత్వ కార్యాలయాలు సైతం మూతపడ్డాయి. వాహనాలు తిరగకుండా గిరిజనులు రేఖపల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తా రోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆదివాసీల ఐక్యత వర్ధిల్లాలంటూ బిగ్గరగా నినదించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి జేఏసీ, ఆదివాసి గిరిజన సంఘాల నాయకులు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు సున్నం.రాజులు, సీపీఎం మండల కార్యదర్శి పులి.సంతోష్ కుమార్, ఎంపీపీ కారం.లక్ష్మి, సర్పంచ్ పూణెం.సరోజిని, ఎంపీటీసీ పూనెం.ప్రదీప్ కుమార్, కారం సుందరయ్య, సోయం చిన్నబాబు, తుర్రం బాబురావు, చిక్కాల రామారావు, పిసా కమిటీ సభ్యులు సారా పాండు, వేటగాని సూరి, వేటగాని మల్లయ్య, చిక్కాల పద్మారావు, పండ వెంకటేశ్వర్లు, కుంజా కన్నయ్య, సోడి మల్లయ్య, నాని, మొట్టుం గంగరాజు, పూనం కిరణ్ కుమార్, ఆత్మకూరి కాంతారావు, గొంది దారయ్య, తోడం అనిల్, కిషోర్, దారమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా.. ఆదిశంకరాచార్యుల జయంతోత్సవం..



**శ్రీశైలం, మే 2 (జనస్వరం) :** శ్రీశైలమహాక్షేత్రంలోని ఉపలయాలలోని పాలధార–పంచధార వద్ద ఉన్న ఆదిశంకరాచార్యుల ఆలయంలో జయంతోత్సవాన్ని శుక్రవారం ఉదయం శాస్త్రోక్తంగా నిర్వహించారు. చతుర్వేద శాస్త్ర పురాణ పారాయణల అనంతరం చంద్ర మౌలీశ్వరస్వామికి, శారదా దేవికి, శంకరాచార్యులుకు అభిషేకాదిఅర్చనలు, విశేష హారతి పూజలు నిర్వహించారు. ఆదిశంకరాచార్యుల వారికి శ్రీశైలమహాక్షేత్రానికి ఎంతో అవినాభావ సంబంధం ఉందని, క్షేత్రపరిధిలోని పాలధార – పంచధార వద్ద దేశపర్యటనలో భాగంగా శంకరుల వారు తపస్సు చేసి "శివానందల హరి" అనే గ్రంథాన్ని రచించినట్లుగా క్షేత్రసాహిత్యం ద్వారా తెలుస్తోంది. అలాగే భ్రమరంభమల్లికార్జున స్వామివార్లను ప్రస్తావించినట్లుగా భ్రమరంభ దేవి ఆలయంలో వామాచార (జంతుబలి) సాంప్రదాయాన్ని మార్చి దక్షిణాచార (సాత్వికబలి) సాంప్రదాయాన్ని ప్రవేశపెట్టినట్లుగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శ్రీ చక్రం ప్రతిష్ఠించినట్లుగా ఆయన రచించిన గ్రంథాలలో పేర్కొన్నారు "యోగ తారావళీ" అనే గ్రంథంలో శ్రీశైలమహాక్షేత్రంలో సమాధి పొందాలని ఆదిశంకరులు అభిలాషించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు అర్చక వేదపండితులు, ఆలయ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

# గిరిజన హక్కులకై మన్యం బంద్

- గిరిజన హక్కుల కోసం మేల్కొనాలి
- ఉద్యమకారుల పిలుపు



**అల్లూరి జిల్లా, మే 2 (జనస్వరం) :** గిరిజనులకు న్యాయం కల్పించాలని, ప్రత్యేక స్పెషల్ డిఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, జీఓ నెంబర్ 3ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, ఉద్యమకారులు నిర్వహించిన "మన్యం బంద్"కు మన్య ప్రాంతంలో పరిమిత స్పందన లభించినప్పటికీ ఉద్యమ కార్యాచరణను సంతరించుకుంది. బంద్‌కు మద్దతుగా పలువురు నాయకులు స్పందిస్తూ, "ఈ పోరాటం కేవలం ప్రస్తుత సమస్యలకే కాదు, రేపటి తరాల భవితవ్యానికి సంబంధించినది" అని వ్యాఖ్యానించారు. గిరిజనులకు సమాన అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక డిఎస్సీ కీలకమని పేర్కొన్నారు. జీఓ నెం 3 అమలుతో స్థానికులైన గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రాధాన్యత లభిస్తుందని, తద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయని అభిప్రాయపడ్డారు. అయితే, ఈ ఉద్యమంలో విద్యార్థులు, నిరుద్యోగ యువత పెద్దగా భాగస్వామ్యం కాకపోవడంపై ఉద్యమ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. "విద్య కొనసాగిస్తున్న యువత భవిష్యత్తును పట్టించుకోకపోతే, చదువుకు అర్థం ఏముంటుంది?" అని గిరిజన మేధావులు ప్రశ్నించారు. చదువు మాత్రమే సరిపోదని, హక్కుల కోసం పోరాడాల్సిన అవసరం ఉందని హితవు పలికారు. ఉద్యోగావకాశాల కోసం పోరాటం చేయకపోతే ప్రభుత్వాల నిర్లక్ష్యానికి బలవుతామని, యువత మౌనంగా ఉంటే మార్పు సాధ్యం కాదని ఉద్యమకులు స్పష్టం చేశారు. యువత, ప్రజా సంఘాలు, రాజకీయ శక్తులు కలిసినప్పుడే సమగ్ర న్యాయం సాధ్యమని వారు హితవు పలికారు. ఉద్యమ నేతలు బంద్ కార్యక్రమాన్ని ఒక హెచ్చరికగా అభివర్ణించారు. "ఇప్పటి నిద్రలేచే యువత రేపటి నాయకులు అవుతారు. వారి చైతన్యం ద్వారానే గిరిజన సమాజానికి న్యాయం లభించగలదు" అని ఆకాంక్షించారు.

# అమరావతి పునః శంకుస్థాపన పనులు విజయవంతం అయ్యాయి

- దేశ ప్రధాని నరేంద్ర మోడీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం ప్రసంగాలు ప్రజలను ఉత్తేజపరిచాయి
- అమరావతి కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను రాష్ట్ర ప్రజలు మర్చిపోలేరు
- అమరావతి ప్రజల రాజధానిగా గుర్తింపు పొందినది
- ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయభాను




**విజయవాడ, మే 2 (జనస్వరం) :** రాష్ట్ర రాజధాని అమరావతి పునః శంకుస్థాపన పనులు ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యక్షంగా ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు రాష్ట్రం నలు మూలల నుండి లక్షలాది సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా తరలి రావడం శుభ పరిణామమని ఎన్టీఆర్ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు సామినేని ఉదయ భాను అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజధానిగా అమరావతి ప్రాంతాన్ని ప్రజలు కోరుకున్నారు కాబట్టే మరోసారి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వానికి ప్రజలు అధికారాన్ని అందించారని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలో రాష్ట్ర అభివృద్ధితో పాటు రాజధాని అభివృద్ధికి కూడా ఇప్పటికే పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఒకవైపు రాష్ట్రంలో ఇప్పటికే అన్ని ప్రధాన రహదారులతో పాటు గ్రామాలలో కూడా రహదారుల నిర్మాణానికి అన్ని విధాలుగా సహకరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారని పేర్కొన్నారు. కేంద్రం నుండి పంచాయతీరాజ్ శాఖకు నిధులు అధికంగా రాబడుతూ గ్రామాల్లో ఉన్న ప్రజలకు ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పిస్తూ వారిని ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్న ఘనత డిప్యూటీ సీఎంకి దక్కిందన్నారు.

# దేశ చరిత్రలో చరిత్రలో నిలిచిపోయే ఏపీ రాజధాని అమరావతి

**- ప్రధాని మోడీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో**
**పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,**
**మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**



**పుట్టపర్తి మే 2 (జనస్వరం) :** దేశ చరిత్రలో ఏపీ రాజధాని అమరావతి ఒక మైలురాయిగా నిలిచిపోతుందని నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు పేర్కొన్నారు. అమరావతి రాజధాని, హైకోర్టు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి శుక్రవారం విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోడీకి అపూర్వ స్వాగతం పలుకుతూ భారీ ఎత్తున ఆంధ్రప్రదేశ్ ప్రజలు మోడీకి మద్దతు పలికి నీరాజనాలు పలికారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి గొప్ప రాజధానిగా చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి పథంలో నడుస్తుందని తెలిపారు. అమరావతి రాజధాని పనులు పున:ప్రారంభ కార్యక్రమంలో అనంత, సత్యసాయి ఉమ్మడి జిల్లాల మంత్రులు పయ్యావుల కేశవ్, సవితా, సత్య కుమార్ యాదవ్‌తో పాటు హిందూపురం ఎంపీలు పార్థసారథి, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతా, మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, సింగనమల ఎమ్మెల్యే శ్రావణి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పాల్గొన్నారు. అమరావతి రాజధానిలో 18 ప్రాజెక్టుల శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోడీ సభ ప్రాంగణంలో అనంతపురం, సత్యసాయి ఉమ్మడి జిల్లాల మంత్రులు ఎంపీలు, ఎమ్మెల్యేలు పల్లె సింధూర రెడ్డి తో పాటు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. అమరావతిలోని రాజధాని పున:ప్రారంభ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన ప్రధాని నరేంద్ర మోడి పర్యటనకు నియోజకవర్గ కూటమి నాయకులు కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

## భక్తిశ్రద్ధలతో శ్రీరాముని దర్శించుకున్న పల్లె ప్రజలు



**యలమంచిలి, మే 2 (జనస్వరం) :** మండలంలోని పేట బయ్యవరం, ఏటికొప్పాక, పురుషోత్తపురం, లైన్ కొత్తూరు, రామకృష్ణాపురం కాలనీ, సోమన్నపాలెం, బీరకాయల పాలెం, కొత్త ఎర్రవరం. యలమంచిలి కొత్తపేట గ్రామాలలో విశాఖ డైరీ చైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభించిన శ్రీరామరక్షా రథయాత్ర భక్తిశ్రద్ధలతో సాగింది. ప్రతి గ్రామంలోనూ శ్రీరామ రక్షా రథాన్ని మంగళ హారతులతో, కోలాటాలతో, భజనలు, కీర్తనలుతో, సేవ గరిడిలతో ఘనంగా స్వాగతం పలికి గ్రామాల్లోకి తీసుకెళ్ళి అయోధ్య రాముడే మా గ్రామానికి వచ్చాడని ఆనందోత్సోహాలతో పల్లె ప్రజలు దర్శించుకున్నారు. ప్రతి గ్రామంలోనూ ప్రసాదాలు తయారు చేసి భక్తులకు పంచారు. ముఖ్యఅతిథిగా పురపాలక సంఘం చైర్ పర్సన్ పిల్లా రామకుమారి హాజరయ్యారు. కళాకారులను అభినందించారు. కలిదిండి శివాజీ బహదూర్, దాట్ల వర్మ బోరవెల్లి ప్రమోద్ కుమార్, రఘు రాజు, పప్పు ఈశ్వరరావు, ఆడారి గంగాధర్, రాజాన సత్యనారాయణ, కొల్లి అప్పారావు, సర్పంచులు కౌన్సిలర్లు, పాల సొసైటీల అధ్యక్షులు, విశాఖ డైరీ సూపర్వైజర్లు, భక్తులు పాల్గొన్నారు.

## మన్యం బంద్ విజయవంతం



**కొయ్యూరు, మే 2 (జనస్వరం) :** మండలంలోని రాజేంద్రపాలెం, డౌనూరు గ్రామాల్లో అఖిలపక్షాల ఆధ్వర్యంలో శుక్రవారం మన్యం బంద్ విజయవంతంగా నిర్వహించారు. జీఓ నెం 3 అమలు చేయడం, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడం వంటి డిమాండ్లతో రాష్ట్రవ్యాప్తంగా జరిగిన బంద్ కు మన్యం ప్రజలు తమ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్, జడ్పీటీసీ వారా నూకరాజు, నర్సీ కృష్ణ, సీపీఐ మండల కార్యదర్శి సరుమూర్తి సూరిబాబు, ఇరువాడ దేముడు, సతీష్, ఉల్లి సూరిబాబు, జేఏసీ నాయకులు అశోక్ లాల్ తదితరులు మాట్లాడారు. "ఆదివాసీల హక్కులు కాలరాయడం జరిగితే ఊరుకోం" అని వారు హెచ్చరించారు. టీడీపీ, వైసీపీ, సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు, ఆదివాసీ ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు బందులో చురుకుగా పాల్గొన్నారు. వ్యాపార సంస్థలు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసి, బందును విజయవంతం చేశారు. ఈ కార్యక్రమం మన్యంలో ఉన్న ప్రజల్లో ప్రభుత్వ విధానాల పట్ల పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబించింది.

## ఆంధ్రప్రదేశ్‌కి న్యాయం చేయండి

**దేశ ప్రధానికి విన్నవించిన ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్**



**విజయవాడ, మే 2 (జనస్వరం) :** కలల రాజధాని అమరావతి నిర్మించుకోవడానికి అందరికంటే మించిన శక్తి మన వద్దే ఉందని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రొఫెషనల్స్ హెడ్ వల్లూరు భార్గవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పార్లమెంటు సాక్షిగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా ద్వారా మాత్రమే అమరావతితో పాటు రాష్ట్ర అభివృద్ధి కూడా జరుగుతుందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ విభజన హామీల ప్రకారం శాశ్వత నిధులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రానికి రుణాల నుంచి విముక్తి దారిలో మాట్లాడతారని రాష్ట్ర ప్రజలందరూ కోరుకున్నారని తెలిపారు. అమరావతి రాజధాని పునః శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసి దేశ ప్రధాని నరేంద్ర మోడీ మరోసారి ఆంధ్రప్రదేశ్ ప్రజల్ని నిరాశ పరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. అమరావతిని నిర్మించడంలో కేంద్ర ప్రభుత్వం పాత్ర కీలకంగా ఉందని ఆ విషయాన్ని మర్చిపోయి దేశ ప్రధాని నరేంద్ర మోడీ మాట్లా డిన తీరు అమరావతి అభివృద్ధికి ఎటువంటి సహకారం అందించలేమని పరోక్షంగా చెప్పడంపై వల్లూరు భార్గవ్ మండిపడ్డారు. ఇప్పటికన్నా ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కూటమిలో భాగ్యస్వామ్యమైనందుకు కేంద్రంలో ఉన్న బీజేపీ అగ్ర నేతలపై ఒత్తిడి తీసుకు వచ్చి రాష్ట్రానికి శాశ్వత నిధులు, రుణ భారాలు లేకుండా తీసుకురావాల్సిందిగా సూచించారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత నుండి రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణాన్ని కోసం కాంగ్రెస్ అన్ని విధాలుగా మద్దతు ఉంటుందని తెలిపారు.

## పార్లమెంటరీ పరిశీలికులు మురళి రాజుకు అభినందనలు



**ప్రత్తిపాడు, మే 2 (జనస్వరం) :** మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన నియోజకవర్గ వైసీపీ నాయకులు, ఎంఎంఆర్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత ముదునూరి మురళి రాజును వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ రెడ్డి ఆదేశాల మేరకు వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్ నర్సాపురం పార్లమెంటరీ పరిశీలకునిగా నియమించడంతో మురళీకృష్ణంరాజును పార్టీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు చేరుకుని పుష్పగుచ్ఛాలు, పూలమాలలు, శాలువాలు, గజమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. ముదునూరి నివాస ప్రాంగణం జనసందడిగా మారింది. పార్టీలో మురళీకృష్ణంరాజు సేవలను గుర్తించి పరిశీలకునిగా నియమించడం పట్ల నియోజకవర్గంలో వైసీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ తనకు అవకాశం ఇచ్చిన జగన్ రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటానని, జగన్ నమ్మకాన్ని నిలబెడతానని, పార్టీ విజయానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను, వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని, జగన్ పాలనకు, ప్రస్తుత సర్కారుకు మధ్య తేడాను ప్రజలకు వివరించి అందరినీ కలుపుకుని పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శరభవరం ఎంపీటీసీ అమరాధి కాశీ, రంగనాథ్ అబ్బాయి, అన్నవరం వైసీపీ సీనియర్ నాయకులు కొండపల్లి అప్పారావు, ఎంపీటీసీ దడాల సతీష్, కిల్లాడి బాబ్జి, గొనగాని రామకృష్ణ, కోన బాబ్జి, బర్ల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా గ్రామదేవతకు విశేష పూజలు

**లోకకల్యాణం స్వామివార్లకు ఊయల సేవోత్సవం**



**శ్రీశైలం, మే 2 (జనస్వరం) :** శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మ అమ్మవారికి విశేషఅలంకారం, విశేష పూజలను, అదేవిధంగా ఆదిదంపతులైన శ్రీభ్రమరాంభ మల్లికార్జున స్వామి వార్లకు ఊయలసేవోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రతి శుక్రవారం ఉదయం గ్రామదేవత అమ్మవారికి దేవస్థానం సేవలలో భాగంగా, అభిషేకం, విశేష పుష్పలంకరణ, కుంకు మార్చన, విశేష పూజలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తామని కార్యనిర్వహణాధికారి యం.శ్రీనివాసరావు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీశైలక్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం ప్రధాన దేవాలయానికి ఎదురుగాగల రహదారికి చివరిలో కుడివైపున ఉత్తర ముఖంగా ఉంటుంది. ప్రకృతి శక్తుల కళలే గ్రామదేవతలని, ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని దేవిభాగవ తంలో చెప్పబడింది. ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపి ంచి లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించి అమ్మవారికి విశేషపూజలను నిర్వహించారు. అమ్మవారి విశేష పూజలను భక్తులు కనులారా వీక్షించారు. అదేవిధంగా ప్రధాన ఆలయంలో స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను సాయంత్రం వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన ఉయలలో ఆశీనులనుచేసి శాస్త్రోక్తంగా విశేషపూజలు జరిపించి వైభవంగా ఊయల సేవను నిర్వహించి ప్రత్యేక హారతులు సమర్పించారు.

## "నాకు పెళ్లి వద్దు.. నన్ను చదివించండి"

**మేయర్‌ను వేడుకున్న గిరిజన బాలిక**



**నెల్లూరు, మే 2 (జనస్వరం) :** "నాకు పెళ్లి వద్దు మేడమ్.. నన్ను బాగా చదివించండి" అంటూ నెల్లూరు బాలసదన్లో మేయర్ పోట్లూరి స్రవంతి ముందు కన్నీళ్లతో వేడుకున్న గిరిజన బాలిక నాగుల సునీత అందరినీ కలిచివేసింది. కోట సంక్షేమ గురుకుల పాఠశాలలో 7వ తరగతి పూర్తి చేసిన సునీతను వేసవి సెలవుల్లో ఇంటికి తీసుకెళ్లిన తల్లిదండ్రులు బలవంతంగా వివాహం చేశారు. ఈ విషయం మీడియాలో వెలుగులోకి రావడంతో గిరిజన (యానాది) విద్యా చైతన్య వేదిక రాష్ట్ర నాయకులు పులి చెంచయ్య గౌరవ మేయర్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన మేయర్ స్రవంతి బాలసదన్లో ఉన్న సునీతను కలిసారు. బాలిక తన చదువు కొనసాగించాలనే తపనను మేయర్ ముందు వ్యక్తపరిచింది. సునీతను ఓదారుస్తూ మేయర్ మాట్లాడుతూ, "నీ చదువుకు మేము అండగా ఉంటాం. నీ తల్లిదండ్రులతో మాట్లాడి మళ్లీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో చేర్పించి నీ భవిష్యత్తు వెలుగొందేలా చూస్తాం" అని హామీ ఇచ్చారు. ఇంట్లో నుంచి ఉపాధ్యాయుల సహాయంతో అర్ధరాత్రి నెల్లూరు బాలసదన్కు చేరిన సునీతకు గిరిజన యానాది విద్యా చైతన్య వేదిక తరఫున రెండు జతల బట్టలు, పండ్లు, తినుబండారాలు మేయర్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో బాలసదన్ ప్రిన్సిపాల్ రజనీ మేడమ్, ఐటిడిఏ పీఓ మల్లికార్జున రెడ్డి, గిరిజన విద్యా చైతన్య వేదిక నాయకులు పులి చెంచయ్య, దాసరి పోలయ్య, వేటగిరి సుధాకర్ రావు, యాకసిరి లోక్ సాయి, కార్తిక్ పాల్గొన్నారు. బాలిక భవిష్యత్తును గౌరవంగా నిలబెట్టడానికి చొరవ చూపిన మేయర్ స్రవంతికి యానాది వేదిక నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నంద్యాల శ్రీరామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలకు జాతీయ స్థాయి అవార్డు




**నంద్యాల, మే 2 (జనస్వరం) :** విద్యారంగంలో అపూర్వమైన సేవలు అందించినందుకు జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డును శ్రీ రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాల సాధించిందని చైర్మన్ డాక్టర్ జి.రామకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇండియా ఎలైట్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషనల్ ఎక్సెలెన్స్ వారిచేత కళాశాలకు ఎడ్యుకేషనల్ స్టాండర్డ్స్ అడాప్టబిలిటీ, ఇంప్లిమెంటేషన్ జాతీ అవార్డు లభించిందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. చైర్మన్ డాక్టర్ జి రామకృష్ణారెడ్డి డైరెక్టర్ జి హేమంత్ రెడ్డి విద్యార్థి వ్యవహారాల డీన్ ఏఎస్ ప్రగతి రెడ్డిలు ఈ అవార్డును స్వీకరించారు. నాలుగు దశాబ్దాలుగా ఈ కళాశాల నిర్వహిస్తున్నామని ఎందరో విద్యార్థులు ఈ కళాశాల నుంచి అత్యధిక ప్రమాణాలతో వెలుపలికి వెళ్లి ఎన్నో ఉద్యోగ అవకాశాలు సాధించారని తెలిపారు. కళాశాలలో పనిచేసే టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, విద్యార్థుల నిబద్ధత ఫలితమే మా విద్యా ప్రమాణాలను మరింత అభివృద్ధి చేసేందుకు ఈ అవార్డు దోహదం చేస్తుందని తెలిపారు. ఈ వేసవి కాలంలో విద్యార్థులకు ఉచితంగా గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలకు ఉచిత వేసవి శిక్షణ తరగతులను నిర్వహిస్తామని తెలిపారు. ఈ ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించేందుకు విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీపీఎస్సీ మరియు గ్రూప్ వన్ గ్రూప్ టు బ్యాంకింగ్ పరీక్షలకు కూడా ఉచిత శిక్షణా తరగతులు ఇస్తామని అర్హులైన విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారి తల్లిదండ్రులకు కూడా విషయం తెలియపరచాలని తెలిపారు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేబీవి సుబ్బయ్య అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## డయాలసిస్ రోగికి ఊరట.. పెన్షన్ మంజూరుతో హర్షం



**వీఆర్ పురం, మే 2 (జనస్వరం) :** వీఆర్ పురం మండలానికి చెందిన కత్తాల మూర్తికి, అనారోగ్య కారణాలతో మూత్రపిండాలు పాడైపోవడంతో, కొద్దికాలంగా చింతూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చికిత్స పొందుతున్నారు. మూర్తికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకం కింద ప్రతినెలా రూ. 10,000 పెన్షన్ మంజూరు అయ్యాయి. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న మూర్తికి ఈ పెన్షన్ కొంత ఊరటను కలిగించిందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. "ఆరోగ్యంతో పోరాడుతున్న సమయంలో ప్రభుత్వం ఇచ్చిన మద్దతుతో గుండె దిట్టగించింది," అంటూ మూర్తి ఆనందం వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు బొర్ర నరసింహారావు, బొర్ర నరేష్, ముత్యాల సిద్దు, ఆది, శేఖర్, సూరి తదితరులు పాల్గొన్నారు. వారు మూర్తిని అభినందిస్తూ, ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల వల్ల అవసరమైన వారికి అండగా నిలుస్తున్నదని పేర్కొన్నారు.

## భావితరాల భవిష్యత్తు అమరావతి రాజధాని

**డబుల్ ఇంజన్ సర్కార్ వల్లే ఆంధ్రుల కలల రాజధానికి మళ్లీ జీవం**



**గన్నవరం, మే 2 (జనస్వరం) :** అమరావతి రాజధాని పునర్నిర్మాణ పనులకి శంకుస్థాపన చేసేందుకు శుక్రవారం విచ్చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎంపీ కేశినేని శివనాథ్ మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఘన స్వాగతం పలికారు. కేరళలోని తిరువనంతపురం నుంచి ప్రత్యేక విమానంలో గన్నవరం విమానాశ్రాయానికి పీఎం మోదీ చేరుకున్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి, రాష్ట్రాభివృద్ధికి అన్ని విధాలుగా సహకరిస్తున్నందుకు పీఎం నరేంద్రమోదీకి ఎంపీ కేశినేని శివనాథ్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం అమరావతి రాజధాని భావితరాల భవిష్యత్తుగా తయారు కానుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వ దుర్మార్గ పాలన వల్ల ఆగిన పోయిన రాజధాని నిర్మాణ పనులకి డబుల్ ఇంజన్ సర్కార్ వల్ల మళ్లీ జీవం వచ్చిందన్నారు. ఐదు కోట్ల మంది ప్రజల కల సాకారం కానుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, సీఎం చంద్రబాబు నాయకత్వంలో గ్లోబల్ సిటీగా అమరావతి అవతరించనుందని పేర్కొన్నారు.

## అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



**నెల్లూరు, మే 2 (జనస్వరం) :** నెల్లూరు కోటమిట్ట 42వ డివిజన్‌కు చెందిన సర్తాజ్ కుటుంబం షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్నిప్రమాదంలో సర్వసంబంధాలను కోల్పోయింది. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు వైసీపీ నెల్లూరు సిటీ ఇన్‌చార్జ్, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ముందుకు వచ్చారు. నెల్లూరు రాంజీ నగర్ వైసీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, మైనార్టీ నాయకులతో కలిసి ఆయన బాధిత కుటుంబానికి నగదు సాయం అందజేశారు. అలాగే, సాయంకు ముందుకు వచ్చిన 42వ డివిజన్ కార్పొరేటర్ కరిముల్లాను చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, "కష్టకాలంలో ఉన్న వారికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది. సర్తాజ్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి" అని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. అగ్ని ప్రమాదంలో తమ జీవితాధారాన్ని కోల్పోయిన ఈ కుటుంబానికి పార్టీ తరపున పూర్తి మద్దతు ఉందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, వైసిపి జిల్లా మైనార్టీ అధ్యక్షులు షేక్ సిద్దిక్, 42వ డివిజన్ కార్పొరేటర్ కరిముల్లా, డివిజన్ నాయకులు అబ్దుల్ మస్తాన్, అలీం, జహీద్ తదితరులు పాల్గొన్నారు.